www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -203 మంగళవారం 10 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

ప్రజాబలంతో సునామీ సృష్టిస్తాం

కొడంగల్‌లో రైతు ఆత్మీయ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

దేవుడు నాకు అన్నీ ఇచ్చాడు.. ప్రజలకు తిరిగి ఇచ్చేస్తా

బియ్యం ధరలపై భయమొద్దు.. ఏడాదికి సరిపడా నిల్వలు

కేటీఆర్ గడ్డం పెంచుకుంటే రేవంత్‌రెడ్డి కాలేడు

2028 డిసెంబరు నాటికి కొడంగల్‌కు కృష్ణా జలాలు

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తాం



రంగారెడ్డినవంబర్. 9(ప్రజావినికిడి):
'ఢిల్లీలో ఉన్న మోదీకైనా, ఫామ్‌హౌస్‌లో ఉన్న కేడీకైనా భయపడేది లేదు' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక్కడ జరిగే అభివృద్ధికి ఎవరైనా తలవంచాల్సిందేనన్నారు. కొడంగల్ ప్రజల ఆశీర్వాదం ఉంటే ఢిల్లీని సైతం ఎదిరించి నిలబడతామని,మిగతా 2లో...

శాంతి స్థాపన చర్యలకు భారత్ సిద్ధం

ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ఫోన్ సంభాషణ

చర్చలు మరియు దౌత్య మార్గాల ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని స్పష్టం చేసిన పీఎంఓ

శాంతి స్థాపనకు అవసరమైన అన్ని చర్యలకు సహకరించేందుకు భారత్ సిద్ధమని వెల్లడి

యుద్ధాన్ని ముగించేలా ఇతర దేశాల నేతలతో భారత్ చర్చలు జరపాలని కోరిన జెలెన్‌స్కీ

ఆహార భద్రత, ఇంధన రక్షణపై అన్ని పక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు జైశంకర్ స్పష్టీకరణ



ఢిల్లీ ,నవంబర్. 9(ప్రజావినికిడి):
రష్యా–ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ సంక్షోభాన్ని కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం సాయంత్రం ప్రధాని మోదీతో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన వివరాలను భారత ప్రధానమంత్రి కార్యాలయం అధికారికంగా విడుదల చేసింది.
పీఎంఓ ప్రకటన ప్రకారం.. రష్యాతో నెలకొన్న ప్రస్తుత యుద్ధ పరిణామాలపై తన అభిప్రాయాలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రధాని మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మిగతా 2లో...

వివాహ బంధానికి పవన్, అన్నా స్వస్తి

మంచి స్నేహితులుగాకొనసాగుతాం

విడాకులపై సంయుక్త ప్రకటన విడుదల



అమరావతి,నవంబర్. 9(ప్రజావినికిడి):
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధిపతి, సినీ నటుడు పవన్ కల్యాణ్... ఆయన సతీమణి అన్నా లెజ్‌నెవా తమ వివాహ బంధానికి ముగింపు పలికారు. దీనిపై సోమవారం రాత్రి ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. 'మా శ్రేయోభిలాషులు... సన్నిహితులకు'... అంటూ పవన్ కల్యాణ్ కొణిదెల, అన్నా కొణిదెల పేర్లతో ఈ ప్రకటన వెలువడింది. "మా జీవితంలో ముఖ్యమైన భాగాన్ని కలిసి గడిపాం. ఇప్పుడు పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నాం.మిగతా 2లో...

డీమానిటైజేషన్‌కు పదేండ్లు..

ఆశించిన ఫలితాలు ఎక్కడ? 2లో.

నల్లధనం, అవినీతి నిర్మూలనలో విఫలం..

నగదు చెలామణికి అడ్డుకట్ట పడలేదా?



తీవ్ర స్థాయికి చేరిన వాయు కాలుష్యం..

ఊపిరి పీల్చుకోవడానికి ఢిల్లీవాసుల అవస్థలు



జిల్లాల్లోనే పూర్తి వైద్య సేవలు

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష

ప్రతి జిల్లాలో డీసీహెచ్ఎస్ కార్యాలయాల ఏర్పాటుపై విస్తృత కసరత్తు

కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



నవంబర్. 9(ప్రజావినికిడి):
తెలంగాణలో సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. ప్రజలు చిన్న సమస్యలకు కూడా రాజధాని మిగతా 2లో...

సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు

పాత పెన్షన్ విధానానికి మారే మార్గదర్శకాలు ఖరారు

ఏపీ ఉద్యోగులకు ఓపీఎస్ అవకాశం.. జీవో విడుదల

డిసెంబర్ 31 వరకు దరఖాస్తుకు గడువు

అమరావతి, నవంబర్. 9(ప్రజావినికిడి):
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోని అర్హులైన ఉద్యోగులు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)లోకి మారేందుకు అవసరమైన సమగ్ర విధివిధానాలను ఖరారు చేస్తూ ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నంబర్ 158ను జారీ చేసింది. అర్హత కలిగిన ఉద్యోగులు ఒకేసారి తమ ఆప్షన్ (వన్-టైమ్ ఆప్షన్) నమోదుమిగతా 2లో...

పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు: కేటీఆర్

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా పరిగి వద్ద అడ్డుకున్న వైనం

రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా అరెస్టు



సుపరిపాలనకే ఈ విజయం

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపిన సీఎం



అమరావతినవంబర్. 9(ప్రజావినికిడి):
స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన అఖండ విజయం తమ సుపరిపాలనకు, అభివృద్ధికి ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రతి పౌరుడికి భద్రత కల్పిస్తూ, భరోసా ఇస్తున్న తమ ప్రభుత్వానికే ప్రజలు మద్దతుగా నిలిచారని, రాజకీయ పార్టీకి ఇంతకంటే పెద్ద రివార్డు ఏముంటుందని ఆయన పేర్కొన్నారు. మీడియా సమావేశంలో మాట్లాడిన చంద్రబాబు, స్థానిక ఎన్నికల ఫలితాలపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజా తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మార్కాపురంలో 21కి 21, అనకాపల్లిలో 24కి 24 జెడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించారు. విశాఖ మేయర్ స్థానాన్ని 2.50 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో కట్టబెట్టారు. ప్రజల కోసం కష్టపడి పనిచేస్తే వారుమిగతా 2లో...

క్యాన్సర్ మందుల తగ్గింపు ధరలు అమల్లోకి

క్యాన్సర్ చికిత్సలో వాడే 1,364 రకాల ఔషధాల ధరలను భారీగా తగ్గించిన కేంద్రం



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సుపరిపాలనకే ఈ విజయం

మొదటిపేజీ తరువాయి

అండగా ఉంటారని ఈ ఫలితాలు నిరూపించాయి“ అని అన్నారు. తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల వల్లే ఈ విజయం సాధ్యమైందని చంద్రబాబు వివరించారు. “సీమ కరవుకు చెక్ పెట్టేలా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేశాం. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, మళ్లీ తొలిదశను ప్రారంభించి రైతుల కష్టాలు తీర్చింది మేమే. పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్లాం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర ఆకాంక్షలకు రెక్కలు తొడిగాం. ప్రజల కోరిక మేరకు మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశాం“ అని ఆయన గుర్తుచేశారు.ప్రతిపక్ష వైసీపీపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. “మేం ప్రజల్ని, వారి నమ్మకాన్ని విశ్వసిస్తే, గొడ్డలి పార్టీ నేరాలను, ఘోరాలనే నమ్ముకుంది. ఎన్నికల్లో హింసను ప్రేరేపించింది. తీవ్రవాదుల తరహాలో హిట్ అండ్ రన్ రాజకీయాలు చేసింది. కానీ, హింసా రాజకీయాలను ప్రజలు ఎన్నడూ ఆమోదించరు. ఇదేమీ రాతియుగం కాదు.. రౌడీయిజం, డ్రామాలతో ప్రజా తీర్పును మార్చలేరని గొడ్డలి పార్టీ గుర్తించుకోవాలి“ అని హెచ్చరించారు.స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ అన్ని విధాలా ప్రయత్నించిందని చంద్రబాబు ఆరోపించారు. “బీసీ రిజర్వేషన్లు, డీలిమిటేషన్ వంటి అంశాలపై పిటిషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలని చూశారు. కానీ, సుప్రీంకోర్టు వారి ప్రయత్నాలకు చెక్ పెట్టింది. ‘వైసీపీ ట్రాప్‌లో పడబోం’ అని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించే దుస్థితికి ఆ పార్టీ దిగజారింది“ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రెండు తుపాన్లు వస్తే ప్రజలను ఆదుకోవడంలో తమ ప్రభుత్వం నిమగ్నమైందని, కానీ ప్రతిపక్షం కనీసం స్పందించలేదని, వారికి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని చంద్రబాబు విమర్శించారు. తాము ఎన్నికల కన్నా ప్రజా సమస్యలకే అధిక ప్రాధాన్యం ఇచ్చామని, దీనిని ప్రజలు అర్థం చేసుకుని తమకు మద్దతుగా నిలిచారని ఆయన పేర్కొన్నారు

ప్రజాబలంతో సునామీ సృష్టిస్తాం

మొదటిపేజీ తరువాయి

ప్రధాని మోదీ అయినా, ప్రతిపక్ష నేత కేసీఆర్ అయినా అభివృద్ధి విషయంలో వెనక్కి తగ్గబోమని చెప్పారు. సంక్రాంతి తరువాత ప్రజాబలంతో సునామీ సృష్టిస్తామని ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ మూడు రంగుల జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. కొడంగల్‌లో మూడో రోజు పర్యటనలో భాగంగా సోమవారం కొడంగల్ నివాసం నుంచి బయలుదేరిన సీఎం రేవంత్‌రెడ్డి.. దారిలో పోలెపల్లి ఎల్లమ్మను దర్శించుకున్నారు. అక్కడి నుంచి లగచర్ల చేరుకుని ఇండస్ట్రియల్‌కారిడార్‌లో నిర్మిస్తున్న ఎకో ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం వేలాది మందితో కలిసి హకీంపేట బహిరంగ సభ వరకు పాదయాత్ర నిర్వహించారు. అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన రైతు ఆత్మీయ సభలో మాట్లాడుతూ.. దేవుడు తనకు జడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి వరకు అన్ని అవకాశాలు ఇచ్చాడని, ఇక ప్రజలకు తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత తనపై ఉందని అన్నారు. తెలంగాణను నంబర్‌వన్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టేందుకు రోజుకు 18 గంటలు కష్టపడుతున్నానని, సీఎం అయిన తరువాత ఒక్క రోజూ సెలవు తీసుకోలేదని చెప్పారు.

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని, అయితే ఈ సమస్యను కలిసికట్టుగా ఎదుర్కొందామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సాధారణంగా కరువు వస్తే ఆహార ధాన్యాలు, తాగునీటి కొరత ఏర్పడుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం ప్రధానంగా నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని అన్నారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బియ్యానికి కొదవ లేదని, 12 నెలలకు సరిపడా బియ్యాన్ని ఖజానాలో దాచిపెట్టామని తెలిపారు. ఈ ఒక్క సీజన్‌లో వడ్లు పండించకపోయినా ఏడాదికి సరిపడా సన్న బియ్యం ప్రభుత్వం వద్ద ఉన్నాయన్నారు. ప్రజలు బియ్యం ధరలు పెరుగుతాయని భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సంక్రాంతి తర్వాత కొడంగల్ నుంచి ప్రజాబలం కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని చెప్పారు. ప్రజల వద్దకు వెళ్లి కరువును ఎదుర్కొనే కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలబెట్టాలనుకున్నానని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆనాడు ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. “ధనిక రాష్ట్రం, మూడు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ఉన్న తెలంగాణలో ఏడో తారీకు వచ్చినా ఉద్యోగస్తులకు జీతభత్యాలు ఇవ్వడం లేదు. ఎందుకని అడిగితే.. పదేళ్లలో కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు అధికారులు చెప్పారు. నెత్తిమీద అప్పు.. చేతిలో చిప్ప పెట్టి అయ్యగారు పోయి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ఇప్పుడే గాడిలో పెడుతున్నాం. 5లక్షల మంది ఉద్యోగులకు మొదటి తారీకున జీతాలు ఇస్తున్నాం. మిగతా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 5వ తేదీన ఇస్తున్నాం” అని సీఎం వివరించారు. నిజాం పాలన నుంచి విముక్తి పొందిన తర్వాత ఎంతో మంది నాయకులు తెలంగాణ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించినా పాలమూరు వలసలు ఆగలేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడితే పాలమూరు రైతుల కష్టాలు తీరుతాయని, వలసలు ఆగుతాయని భావించి 2009 ఎన్నికల్లో కేసీఆర్‌కు మద్దతిచ్చామని తెలిపారు. ఉద్యమం దెబ్బతినకూడదని విఠల్‌రావును పక్కనపెట్టి కేసీఆర్‌ను పార్లమెంటుకు పంపించామని చెప్పారు. తెలంగాణ సాధన కోసం కనిపించిన ప్రతి దేవుడినీ మొక్కుకున్నామని, రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ పాలమూరు జిల్లాకు ప్రాధాన్యత ఇస్తారని ప్రజలు ఆశించారని అన్నారు. అయితే తనను ఆదరించిన పాలమూరు ప్రజల కష్టాలను కేసీఆర్ పట్టించుకోలేదని ఆరోపించారు.

శాంతి స్థాపన చర్యలకు భారత్ సిద్ధం

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో భారత్ ఎల్లప్పుడూ అనుసరించే ‘మానవతా దృక్పథాన్ని’ పునరుద్ఘాటించారు. వివాదాలను కేవలం చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలనేది భారత్ యొక్క స్థిరమైన విధానమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన అన్ని రకాల ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు. అలాగే, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వివిధ రంగాలలో భారత్–ఉక్రెయిన్ ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై కూడా నేతలిద్దరూ చర్చించారు.మరోవైపు, ఈ ఫోన్ సంభాషణపై ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. యుద్ధాన్ని ముగింపు దశకు తీసుకువచ్చేందుకు అవసరమైన దౌత్య ప్రక్రియలు, తదుపరి చర్యలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు పేర్కొంది. రాబోయే అబూదాబీ సమావేశ ఎజెండా కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక వైఖరితోనే ఉందని, రష్యా నుంచి కూడా యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించే విధంగా అలాంటి చొరవే అవసరమని ఆయన పేర్కొన్నారు.

“ఇది యుద్ధాన్ని కొనసాగించాల్సిన సమయం కాదు.. ముగించాల్సిన సమయం అని రష్యా నాయకత్వంతో సహా అందరికీ ప్రధాని మోదీ గతంలో పలుమార్లు స్పష్టంగా చెప్పారు. ఈ నేపథ్యంలో యుద్ధానికి ముగింపు పలికేలా భారత్ తన వంతుగా ఎలాంటి చర్యలు తీసుకోగలదో గుర్తించడం, ఇతర దేశాల నాయకులతో సంప్రదింపులు జరపడం ఎంతో కీలకం“ అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. నల్ల సముద్రంలో నిలిచిపోయిన ధాన్యపు ఎగుమతులు, ఆహార భద్రత అంశంపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. ఆహార రవాణా కారిడార్ల పునరుద్ధరణలో మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో భారత్ చేసే ప్రయత్నాల కోసం తాము ఎదురుచూస్తున్నామని ఉక్రెయిన్ తెలిపింది. సముద్ర మార్గాలను అడ్డుకోవడం వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థతో పాటు వివిధ దేశాల్లోని కోట్లాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల అట్లాంటాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ, ఈ సంక్షోభ పరిష్కారం కోసం భారత్ నిరంతరం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. పౌర నౌకలు మరియు నావికులపై దాడులు జరగకుండా చూడటం, నల్ల సముద్రం ద్వారా ధాన్యపు ఎగుమతులను పునరుద్ధరించడం, అలాగే ఇంధన మౌలిక వసతులపై దాడులు జరగకుండా చూడటం అనే మూడు ప్రధాన అంశాలపై భారత్ రష్యా, ఉక్రెయిన్ మరియు యూరప్ దేశాలతో చర్చిస్తోందని తెలిపారు.

డీమానిటైజేషన్‌కు పదేండ్లు..



న్యూఢిల్లీ:నవంబర్. 9(ప్రజావినికిడి):దేశ ఆర్థిక వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని, నల్లధనం, అవినీతి, నకిలీ కరెన్సీ, ఉగ్రవాదానికి నిధుల సరఫరాను అరికడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి అమలు చేసిన పెద్ద నోట్ల రద్దుకు పదేళ్లు పూర్తయ్యాయి. 2016 నవంబర్ 8న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. అయితే పదేళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూస్తే నోట్ల రద్దు లక్ష్యాలు ఎంతవరకు నెరవేరాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నాడు చెలామణిలో ఉన్న రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేయడంతో దేశ ఆర్థిక వ్యవస్థలోని నగదులో దాదాపు 86 శాతం ఒక్కసారిగా చెల్లుబాటు కాకుండా పోయింది. దీంతో సామాన్య ప్రజలు, చిరు వ్యాపారులు, కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బ్యాంకులు, ఏటీఎంల ముందు రోజుల తరబడి బారులు తీరాల్సి వచ్చింది.

నోట్ల రద్దుతో నగదుపై ఆధారపడటం తగ్గుతుందని ప్రభుత్వం భావించింది. కానీ పదేళ్ల తర్వాత కూడా నగదు వినియోగం కొనసాగుతూనే ఉంది. 2025-26లో చెలామణిలో ఉన్న నగదు విలువలో రూ.500 నోట్ల వాటా 85.5 శాతంగా ఉన్నట్లు ఆర్బీఐ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది నగదు ఆధారిత లావాదేవీలను తగ్గించడంలో నోట్ల రద్దు ప్రభావం పరిమితంగానే ఉందని సూచిస్తోంది.

నల్లధనాన్ని వెలికితీయడం, అవినీతిని నిర్మూలించడం నోట్ల రద్దు ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. అయినప్పటికీ అవినీతి సూచీలో భారత్ స్థానం గణనీయంగా మెరుగుపడలేదు. హవాలా లావాదేవీలు, మనీలాండరింగ్ సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. బినామీ ఆస్తుల వ్యవహారాల్లోనూ ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఎన్నికల్లో నల్లధనం వినియోగాన్ని అరికడతామన్న ప్రభుత్వ లక్ష్యానికి భిన్నంగా ఎన్నికల సమయంలో నగదు పట్టివేతలు పెరుగుతున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో రూ.304 కోట్ల నగదును స్వాధీనం చేసుకోగా, 2019లో రూ.804 కోట్లు, 2024లో రూ.1,067 కోట్లకు పెరిగింది. ఇది ఎన్నికల్లో అక్రమ నగదు ప్రవాహంపై ఆందోళనలను పెంచుతోంది.

నోట్ల రద్దు సమయంలో ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యాలకు, పదేళ్ల తర్వాత కనిపిస్తున్న వాస్తవ పరిస్థితులకు మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలు ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులు, చిరు వ్యాపార రంగంపై పడిన ప్రభావం, ఆశించిన ఫలితాలు సాధించలేకపోవడం వంటి అంశాలు ఇప్పటికీ చర్చనీయాంశాలుగానే ఉన్నాయి. భారీ నిర్ణయాలు తీసుకోవడం మాత్రమే కాకుండా వాటి వల్ల ప్రజలకు ఎంత ప్రయోజనం కలిగిందన్నదే అసలైన కొలమానం. ఆ దృష్టితో చూస్తే పెద్ద నోట్ల రద్దు పదేళ్ల ప్రస్థానం అనేక ప్రశ్నలను మిగిల్చిందని చెప్పవచ్చు.

తీవ్ర స్థాయికి చేరిన వాయు కాలుష్యం..

ఊపిరి పీల్చుకోవడానికి ఢిల్లీవాసుల అవస్థలు

ఢిల్లీ నవంబర్. 9(ప్రజావినికిడి):

దీపావళి వేడుకలు ముగిసిన మరుసటి రోజే దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరింది. కాలుష్య నియంత్రణకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 3 ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ, నగరంలో గాలి నాణ్యత ‘సివియర్’ కేటగిరీకి పడిపోయింది. దట్టమైన విషపూరిత పొగమంచు నగరాన్ని పూర్తిగా కమ్మేసింది.

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వివరాల ప్రకారం, ఉదయం 8.10 గంటల సమయానికి ఢిల్లీలో సగటు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 483గా నమోదైంది. నగరంలోని 15 మానిటరింగ్ స్టేషన్లలో ౫౫× 400 మార్కును దాటింది. వివేక్ విహార్‌లో 445, బురారీ క్రాసింగ్‌లో 441, జహంగీర్‌పురిలో 442, రోహిణిలో 438 వరకు ౫౫× రికార్డైంది. ప్రైవేట్ స్విస్ సంస్థ ఐక్యూఎయిర్ ప్రకారం షాహ్దరా ప్రాంతంలో ౫౫× ఏకంగా 1,000 మార్కును దాటింది.

ఈ కాలుష్యం కారణంగా రోడ్లపై విజిబిలిటీ భారీగా తగ్గింది. అక్షరధామ్ ఫ్లైఓవర్ నుంచి చూస్తే సమీపంలోని ఆలయం కూడా కనిపించనంతగా పొగమంచు పేరుకుపోయింది. ఐటీవో, ఢిల్లీ-నోయిడా సరిహద్దుల్లో వాహనదారులు ఉదయమే హెడ్‌లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. గాల్లోని విషతుల్య పొగల వల్ల ప్రజలు కళ్ల మంటలు, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కాలుష్య తీవ్రత దృష్ట్యా కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ స్టేజ్ 3 నిబంధనల ప్రకారం నిర్మాణ పనులను నిలిపివేసి, వాహనాలపై ఆంక్షలు విధించింది. ప్రైమరీ స్కూళ్లకు హైబ్రిడ్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ప్రతికూల వాతావరణం వల్ల పరిస్థితి మరింత క్షీణించే అవకాశం ఉందని హెచ్చరికలు వెలువడుతున్నాయి. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోతో పాటు ముంబైలోని బాంద్రా, ఘాట్‌కోపర్ తదితర ప్రాంతాల్లోనూ గాలి నాణ్యత గణనీయంగా క్షీణించింది.

వివాహ బంధానికి పవన్, అన్నా స్వస్తి

మొదటిపేజీ తరువాయి

మా వైవాహిక జీవితం ముగిసినప్పటికీ... మంచి స్నేహితులుగా, మా పిల్లలకు మంచి తల్లిదండ్రులుగా కొనసాగుతాం.మా పిల్లల ఆనందం, శ్రేయస్సు ఎప్పటికీ మా ఉమ్మడి ప్రాధాన్యాల్లో భాగంగా ఉంటుంది. మా వ్యక్తిగత జీవితంలో జరుగుతున్న మార్పు ఇది. దీనిని అర్థం చేసుకుంటారని, మా ప్రైవసీని గౌరవిస్తారని ఆశిస్తున్నాం. మా ప్రయాణంలో తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు” అని ఆ ప్రకటనలో తెలిపారు. పవన్ కల్యాణ్‌కు ఇది మూడో వివాహం.

ఆయన సినీరంగ ప్రవేశం తర్వాత ఒక యువతిని పెళ్లాడారు. కొన్నేళ్లకు వారు విడిపోయారు. ఆ తర్వాత 2009లో నటి రేణూ దేశాయ్‌ని పెళ్లాడారు. వీరు కూడా పరస్పర అవగాహనతో డిపోయారు. 2013లో రష్యాకు చెందిన అన్నా లెజ్‌నెవాను పవన్ పెళ్లి చేసుకున్నారు.

సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు

మొదటిపేజీ తరువాయి

చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం మార్గదర్శకాలను అధికారికంగా విడుదల చేసింది.

ఈ నిర్ణయంతో 2004 సెప్టెంబర్ 1కి ముందు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలై, ఆ తేదీ తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారితో పాటు, అప్పటికే పదవీ విరమణ పొందినవారు, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కూడా ఈ వెసులుబాటు వర్తిస్తుంది. దాదాపు 10,715 మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు దీనివల్ల లబ్ధి చేకూరనుంది.

ఓపీఎస్‌కు మారాలనుకునే అర్హులు 2026 డిసెంబర్ 31వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా తమ ఆప్షన్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని ‘నిధి‘ పోర్టల్ ద్వారానే నిర్వహిస్తారు. ఇందుకోసం ఉద్యోగులు తమ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్, ఎంపిక జాబితా, నియామక ఉత్తర్వులు, జాయినింగ్ ఆర్డర్ కాపీలను జతచేయాల్సి ఉంటుంది. ఓపీఎస్ ఎంచుకున్న ఉద్యోగులకు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాను ప్రారంభిస్తారు.

క్యాన్సర్ మందుల తగ్గింపు ధరలు అమల్లోకి

క్యాన్సర్ చికిత్సలో వాడే 1,364 రకాల ఔషధాల ధరలను భారీగా తగ్గించిన కేంద్రం

ఢిల్లీ , నవంబర్. 9(ప్రజావినికిడి):

దేశవ్యాప్తంగా క్యాన్సర్ రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ప్రాణాంతక క్యాన్సర్ చికిత్సలో అత్యంత కీలకమైన మందుల ధరలను భారీగా తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం సోమవారం (2026 నవంబర్ 9) నుంచి అధికారికంగా అమల్లోకి వచ్చింది. జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) క్యాన్సర్ నిరోధక మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయడంతో, మార్కెట్లో లభించే దాదాపు 1,364 రకాల ఔషధ ఫార్ములేషన్ల గరిష్ఠ చిల్లర ధరలు (ఎంఆర్‌పీ) గణనీయంగా తగ్గాయి.

నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎన్‌పీపీఏ ఈ చర్యలు చేపట్టింది. మొత్తం 85 ఫార్మా కంపెనీలకు చెందిన 121 రకాల క్యాన్సర్ ఔషధాలు ఈ తాజా ధరల తగ్గింపు పరిధిలోకి వచ్చాయి. వీటిలో 679 బ్రాండ్ల ధరలు ఏకంగా 50 శాతం కంటే ఎక్కువగా తగ్గగా, కొన్ని మందులపై అత్యధికంగా 96.45 శాతం వరకు తగ్గింపు నమోదైంది. ఈ కీలక నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా క్యాన్సర్ బాధితులకు మందుల కొనుగోలుపై ఏటా సుమారు రూ. 3,540.38 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గనుందని అధికార వర్గాలు వెల్లడించాయి.

దాదాపు 20 రకాలకు పైగా క్యాన్సర్ల చికిత్సలో ఉపయోగించే కీలకమైన ఇమ్యునోథెరపీ మరియు ఇతర ప్రాణరక్షక ఔషధాల ధరలు దిగివచ్చాయి. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ చికిత్సలో వాడే ‘అనస్ట్రోజోల్‘ (10 మాత్రలు) పాత ధర రూ. 695.76 ఉండగా, అది ఇప్పుడు కేవలం రూ. 73కే అందుబాటులోకి వచ్చింది. డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన ‘అజాసైటిన్‘ ఇంజెక్షన్ ధర రూ. 6,337 నుంచి రూ. 1,495.04కు తగ్గింది. అబోట్ సంస్థకు చెందిన ‘బెవాసిజుమాబ్‘ (4 ఎంఎల్) ఇంజెక్షన్ పాత ధర రూ. 21,767.70 కాగా, తాజా మార్గదర్శకాలతో అది రూ. 5,930.13కు లభించనుంది. అలాగే ఆర్పీజీ లైఫ్ సైన్సెస్‌కు చెందిన ‘డెబ్రుమాబ్ 60 ఎంజీ‘ ఇంజెక్షన్ ధర రూ. 22,031.25 నుంచి రూ. 5,941కి, ‘ఎనుటా‘ క్యాప్సూల్స్ (28 మాత్రలు) ధర రూ. 6,578.20 నుంచి రూ. 2,232కు పడిపోయాయి. వీటితో పాటు ఎర్లోటినిబ్, ఫ్లుడారాబిన్, ఫుల్వెస్ట్రాంట్ వంటి పలు కీలక ఔషధాల ధరలు కూడా భారీగా తగ్గాయి.

సవరించిన ధరలను రిటైలర్లు, డీలర్లు, ఆసుపత్రులు మరియు మెడికల్ దుకాణాలు తమ ప్రాంగణాల్లో బోర్డులపై, అలాగే తమ వెబ్‌సైట్లలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని అధికారులు ఆదేశించారు. నూతన ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదని తేల్చిచెప్పారు. ఈ నిబంధనల అమలును రాష్ట్ర ఔషధ నియంత్రణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించనున్నారు.

వినియోగదారులు సవరించిన ధరల వివరాలను ఔషధ ప్యాకెట్లపై చూసుకోవడంతో పాటు ‘ఫార్మా సహీ దామ్‘ మొబైల్ యాప్ లేదా ఎన్‌పీపీఏ వెబ్‌సైట్ ద్వారా ధ్రువీకరించుకోవచ్చు. ఒకవేళ ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే, బాధితులు ‘ఫార్మా జన్ సమాధాన్‘ పోర్టల్ ద్వారా గానీ, లేదా ఉచిత హెల్ప్‌లైన్ నంబర్ 1800-111-255 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

జిల్లాల్లోనే పూర్తి వైద్య సేవలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా, జిల్లాల్లోనే కార్పొరేట్ స్థాయి పూర్తి వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు.హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రుల్లో సేవల నాణ్యత, పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) కార్యాలయాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. రాష్ట్ర స్థాయి డైరెక్టరేట్ నుంచి జిల్లా స్థాయి వరకు స్పష్టమైన పాలనా బాధ్యతలు ఉండాలని మంత్రి పేర్కొన్నారు.కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ), ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మౌలిక వసతుల లోపాలు, సిబ్బంది కొరత వంటి సమస్యలను జిల్లా స్థాయిలోనే ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సూచించారు.వైద్య సేవల విస్తరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యుల నియామకాలతో పాటు అవసరమైన నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన చికిత్సను చేరువ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన తెలిపారు.

పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు: కేటీఆర్

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళుతున్న నాయకుడిని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు.వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని బహార్‌పేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోస్గిలో మరణించిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నందున, ముందస్తు జాగ్రత్త చర్యగానే నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు.

ఈ ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. “పరామర్శించేందుకు వెళుతున్న నాయకుడిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా? నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ పార్టీ పాలనగా మార్చుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదు. ప్రజల, కార్యకర్తల పక్షాన పోరాటం కొనసాగుతుంది. పట్నం నరేందర్‌రెడ్డిని ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలి” అని డిమాండ్ చేశారు.మరోవైపు, పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా ఖండించారు. ప్రతిపక్ష నేతలను అకారణంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
మంగళవారం 10 నవంబర్ 2026

ప్రభుత్వ భూముల్లో ఉన్న గిరిజనేతరులను భూ రీ సర్వేలో తొలగించాలి

ప్రజావాణిలో వినతి పత్రం అందించిన ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకులు





వాజేడు,నవంబర్ 10,(ప్రజావినికిడి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే ద్వారా గిరిజనేతరుల కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలి. అనుభవదారి కాలమ్ నుండి వారి పేర్లు తొలిగించి అనుభవదారి కాలమ్ లో ప్రభుత్వం అని నమోదు చేయలి.

అక్రమంగా ప్రభుత్వ భూముల్లో ఉన్న గిరిజనేతరుల పైన ఎల్ టి ఆర్ కేసులు నమోదు చేయలి. ప్రజావాణిలో వినతి పత్రం అందించిన ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకులు. వాజేడు మండలంలో ప్రభుత్వం చేపడుతున్న రెవిన్యూ రీ సర్వే లోపభూయిష్టంగా ఉందని, ఆదివాసీ నవ నిర్మాణసేన నాయకులు సోమవారం గ్రీవెన్స్ డే లో అధికారులకు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఏజెన్సీ భూ చట్టాలు అయిన 1917, 1/59, 1/70 చట్టాలను పూర్తిగా ఉల్లంఘించేదిగా ఉన్నది.ఈ సర్వే ద్వారా గిరిజనేతరుల కబ్జాలో అక్రమంగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించే సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేసి, గుర్తించిన ప్రభుత్వ భూముల్లో గిరిజనేతరులు అనుభవ దారులుగా ఉన్నట్టుగా రికార్డ్స్ లో పొందు పరచడం చేస్తున్నారు.పట్టాలు మీరు వారికీ ఇవ్వక పోవచ్చు కానీ వారు సాగులో ఉన్నట్టుగా గుర్తించినట్టు అవుతున్నది.ఇది 1917,1/59,1/70 భూమి చట్టాలను మాత్రమే కాదు కోనేరు రంగారావు సిఫారస్సులను సైతం నేరుగా ఉల్లంఘించినట్టు అవుతుంది.పైన తెలిపిన చట్టాలు గిరిజనేతరులకు ఎటువంటి భూమి హక్కులు లేవు అని చెప్తున్నాయి.కోనేరు రంగారావు సిఫారస్సులు షెడ్యూల్ ఏరియాలో ఉన్న ప్రతి గుంట భూమి గిరిజనులదే అని చెప్పడం జరిగింది.అలాగే సమతా వర్సెస్ స్టేట్ అఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో గౌరవ సుప్రీమ్ కోర్టు గిరిజనేతరుల కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని తెలపడం జరిగింది.కావున రీ సర్వే ద్వారా గిరిజనేతరుల కబ్జాలో ఉన్న ప్రతి గుంట భూమిని గుర్తించి అనుభవదారుల రికార్డు నుండి వాళ్ళను తొలిగించి,ఆ కాలమ్ లో ప్రభుత్వం అని పొందు పర్చండి.అలాగే అక్రమ భూ కబ్జా దారులు అయిన గిరిజనేతరుల పైన క్రిమినల్,ఎల్ టి ఆర్ కేసులు నమోదు చేయగలరు.తద్వారా షెడ్యూల్ ప్రాంతం చట్టాలను గౌరవించినట్టు అవుతుంది.లేని యడల ఆదివాసీ నవనిర్మాణ సేన నుండి ప్రభుత్వం పైన న్యాస్థానాన్ని ఆశ్రయిస్తామని ఈ వినతి పత్రంలో పేర్కొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆదివాసీ నవ నిర్మాణ సేన ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్,ఏ ఎన్ ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్,మండల కార్యదర్శి తల్లడి ప్రసాద్, నాయకులు తల్లడి నానిబాబు, ప్రకాశ్,సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు..

ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలి

జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

రంగారెడ్డి,(ప్రజావినికిడి):



ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులపై అధికారులు తక్షణమే స్పందించాలని, పరిష్కారంలో జాప్యం చేయకుండా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 26 ఫిర్యాదులు అందగా,వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 19, ఇతర శాఖలకు సంబంధించి 7 దరఖాస్తులు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి,చంద్ర రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యాదవుల సంస్కృతి సాంప్రదాయాలకు సదర్ పండగ ప్రతిక

బండి రవి యాదవ్ -శంషాబాద్ ఇంద్రారెడ్డి నగర్ లో సదర్ పండగ ఉత్సవం

ఇంటి వద్ద ప్రత్యేక పూజలు చేసి సదరు ఉత్సవాల్లో పాల్గొన్న బండి రవి యాదవ్





శంషాబాద్ (ప్రజావినికిడి): నవంబర్ 9, యాదవుల సంస్కృతి సాంప్రదాయాలకు సదర్ పండగ ప్రతిక అని బండి రవి యాదవ్ అన్నారు.సదర్ పండగ ఉత్సవాలలో భాగంగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సర్కిల్ కొత్వాల్ గూడ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి నగర్ కాలనీలో బండి రవి యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి తన ఇంటి వద్ద ప్రత్యేక పూజలు చేసి దున్నపోతును అలంకరించి సదరు ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సందర్భంగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబిగా నిలుస్తుంది అన్నారు. యాదవ సోదరులందరూ ఐక్యతతో, ఆత్మగౌరవంతో, సాంప్రదాయపద్ధంగా చేసుకునే ఏకైక పండగ సదర్ ఉత్సవ పండగ అన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సాంప్రదాయాన్ని కాపాడుకుంటూ ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ఉప్పల్ మెట్రో రైల్ స్టేషన్‌లో ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన యూఐడిఐఏ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంగీత





ఉప్పల్,(ప్రజావినికిడి):
హైదరాబాద్ ఉప్పల్ మెట్రో రైల్వే స్టేషన్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన ఆధార్ సేవా కేంద్రం ప్రారంభమయ్యింది.యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ జనరల్,ఐఏఎస్ పి.సంగీత, ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ కె.ఎం. భారతి లు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పి. సంగీత మాట్లాడుతూ, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఆధార్ సేవల కోసం ఈ కేంద్రాన్ని వినియోగించుకోవచ్చని అన్నారు. ఆధార్ నమోదు, పేరు, చిరునామా, ఇతర వ్యక్తిగత వివరాల సవరణలు, బయోమెట్రిక్ నవీకరణ తదితర సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని వివరించారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో క్రమబద్ధమైన సేవలందించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఐదు నుంచి పదిహేను ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు నిర్దేశిత సమయంలో తప్పనిసరిగా తమ ఆధార్ బయోమెట్రిక్ వివరాలను నవీకరించుకోవాలని సంగీత సూచించారు. జేఈఈ వంటి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఆధార్ వివరాలు సక్రమంగా, తాజాగా ఉండటం ముఖ్యమని తెలిపారు.ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల ఆధార్ వివరాల నవీకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. తెలంగాణలో యూఐడీఏఐ కొత్తగా ఏర్పాటు చేస్తున్న పధ్నాలుగు ఆధార్ సేవా కేంద్రాల్లో ఉప్పల్‌లో ప్రారంభించిన కేంద్రం పదమూడవ బ్రాంచ్ అని ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ కె.ఎం. భారతి వెల్లడించారు.ఈ కేంద్రం ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పనిచేస్తుందని, ఆదివారం కూడా సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ రంగనాథ్‌రెడ్డి, సెంట్రల్ మేనేజర్ వెంకన్న, ఆపరేషన్స్ మేనేజర్ కార్తీక్, యూఐడీఏఐ సిబ్బంది,సేవా భాగస్వాములు పాల్గొన్నారు.

వీసీపై లైంగిక వేధింపుల ఆరోపణలు..

నిష్పక్షపాత విచారణకు డిమాండ్

బాధిత మహిళకు న్యాయం చేయాలంటూ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మరోసారి ఆందోళన..





రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): నవంబర్ 9, రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వీసీపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు మరోసారి ఆందోళనకు దారితీశాయి.ఈ ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి బాధిత మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విశ్వవిద్యాలయ టీచింగ్,నాన్ టీచింగ్ సిబ్బందితో పాటు విద్యార్థులు మరోసారి నిరసనకు దిగారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, విద్యార్థులు క్యాంటీన్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి పరిపాలనా భవనం వరకు ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. వీసీపై వచ్చిన ఆరోపణలపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.మహిళా ఉద్యోగినుల ఆత్మగౌరవం, భద్రతకు భరోసా కల్పించాలని నినాదాలు చేశారు.విశ్వవిద్యాలయంలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని,ఇలాంటిశీ ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ఆందోళనకారులు కోరారు.బాధిత మహిళకు అండగా నిలిచి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇదిలా ఉండగా,తనపై జరిగిన ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి న్యాయం చేయాలని బాధిత మహిళ సైతం కోరారు. ఇప్పటికే ఒకసారి నిరసన తెలిపిన సిబ్బంది, విద్యార్థులు తాజాగా మరోసారి ఆందోళనకు దిగడంతో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని ఆందోళనకారులు స్పష్టం చేశారు.

దృష్టిలోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రపంచంలోనే తొలి న్యాయ కళాశాల..

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం



శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 9, దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు న్యాయ విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రపంచంలోనే మొట్టమొదటి ప్రత్యేక న్యాయ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టోర్ రెడ్డి వెల్లడించారు.ఈ కళాశాల ఏర్పాటుకు సంబంధించిన దరఖాస్తును ఉన్నత విద్యామండలి ఆమోదించిందని తెలిపారు. విద్యకు దూరంగా ఉన్న వర్గాలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఇటువంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ముచ్చింతల్ శ్రీరామనగరంలోని చినజీయర్ స్వామి ఆశ్రమంలో నిర్వహిస్తున్న యతీంద్ర సప్తతి వేడుకల్లో రెండో రోజు ఈ ప్రకటన చేశారు.ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్ తదితర దేశాల్లో సేవలందిస్తున్న జీయర్ సంస్థల ప్రతినిధులు తమ సేవా కార్యక్రమాలను శ్రీ చిన్న జీయర్ స్వామివారికి వివరించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్,వికాస తరంగిణి,జీయర్ ఇంటిగ్రేటెడ్ వైదిక్ అకాడమీ, స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ,దివ్య సాకేతం తదితర సంస్థలు విద్య, ఆధ్యాత్మికత, వైద్యం, సామాజిక సేవా రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను ప్రదర్శనల ద్వారా వివరించారు. గురుకులాల ద్వారా వేద విద్యను ప్రోత్సహించడం, దృష్టిలోపం ఉన్న విద్యార్థులు, గిరిజన పిల్లలకు విద్య అందించడం, ఆలయాల పునరుద్ధరణ, యాత్రికులకు వసతి, అన్నదానం వంటి సేవలను వివరించారు.ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామివారు మాట్లాడుతూ, భగవద్రామానుజుల సమానత్వ సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంస్థల అభివృద్ధిలో స్వచ్ఛంద సేవకులు,దాతల అంకితభావం ఎంతో కీలకమని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా సుందరకాండ పారాయణం, హనుమంతునికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. మూడో రోజు కార్యక్రమాల్లో భాగంగా పుస్తకావిష్కరణలు,తెలంగాణ కళాకారుల ప్రదర్శనలు, లోకశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం ద్వారా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.





మంత్రి ప్రకటనకు అభినందనలు కానీ హామీలు కాదు.

జీవో రద్దు పై అధికారిక ప్రకటన రావాలి.

జీవో 641 రద్దయ్యే వరకు ప్రజా ఉద్యమం సాగుతుంది.

సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ



షాద్ నగర్,(ప్రజావినికిడి):
రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో గత శనివారం జరిగిన ఒక సభలో రాష్ట్ర రెవిన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కొత్తూరు మండలంలోని సిద్దాపూర్ లో డంపింగ్ యార్డు రాదు,రానివ్వను అని ప్రకటన చేయడం అభినందించదగ్గ విషయం అని,జేఏసి గా స్వాగతిస్తున్నామని ఎన్ని రోజుల్లో అధికారికంగా జీవో రద్దు చేస్తారో తెలుపాలని సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ రాంబల్ నాయక్,కన్వీనర్ పినపాక ప్రభాకర్,కో ఆర్డినేటర్ తిరుమలయ్య లు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,
సిద్దాపూర్ లో డంపింగ్ యార్డు రద్దు చేయాలని ప్రజా పోరాటాలే, లేకప్రజా పోరాటాల వల్లే రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి ఈ డంపింగ్ యార్డు రాదు అని ప్రజా సమూహంగా ప్రకటన చేయాల్సి వచ్చింది అన్నారు.ఈ ప్రకటనను స్వాగతిస్తున్నామని,కేవలం ప్రకటనకే పరిమితం కాకుండా జీవో రద్దు కొరకు అధికారిక ప్రకటన చేయాలి అని కోరారు. ఈ ఉద్యమమని ప్రభుత్వం అధికారికంగా ఈ జీవో 641 నీ రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగుతుంది అని స్పష్టం చేశారు.దీనిపై ఎలాంటి అపోహలు వద్దని ప్రజా ఉద్యమానికే ఈ రోజు మంత్రి ప్రకటన అనే విషయం మరువ వద్దని,అదే ప్రజా ఉద్యమనే లేకపోతే జీవో తెచ్చిన వాళ్లే ఎందుకు రాదు అంటారో ఆలోచన చేయాలని అన్నారు.ప్రజా ఉద్యమాల ద్వారానే విజయాలు సాధిస్తాం అన్నారు.ఇది ప్రజా ఉద్యమం సాధించిన ఒక నైతిక విజయమే అని,కేవలం హామీలకు సంబరపడి ఉద్యమాన్ని వదిలే ప్రసక్తే లేదన్నారు.హామీలు కేవలం ఉపశమనం మాత్రమేనని, గతంలో కూడా స్థానిక సాధన సభ్యులు నేను దంపు యార్డు రానివ్వను అని చెప్పిన రెండ్రోజులకే అధికారికంగా జీవో వచ్చిన విషయం మర్చిపోరాదని గుర్తు చేశారు.గత ప్రభుత్వం లో లక్ష్మి దేవి పల్లి రిజర్వాయర్ విషయంలో ప్రజా సంఘాలు పోరాటం చేస్తున్న సమయంలో ఆనాడు గద్దర్ సమక్షంలో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మా ప్రభుత్వం రాగానే వెంటనే ప్రాజెక్ట్ మొదలు పెడతాం అని హామీ ఇచ్చారు. కానీ మూడు సంవత్సరాలుగా తట్టెడు మట్టి ఎత్తారా ఆలోచన చేయాలి అన్నారు.ఇలా రోజుకొక మాట చెప్తే నమ్మే రోజులు పోయాయని,
జీవో పై అధికారికంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.నిజంగా ప్రజలపై అంత ప్రేమ ఉంటే స్థానిక శాసన సభ్యులు దీక్ష శిబిరం వద్దకు వచ్చి నేను డంపింగ్ యార్డు జీవో ను ఒక నెలలో లేదా రెండు నెలల్లో రద్దు చేయిస్తా అని సరైన హామీ ఇస్తే జేఏసి గా చర్చించి ఈ ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.అలా కాకుండా రానియ్యం,రాదు అంటే ఇది రాజకీయ క్రీడే అవుతుంది,ప్రజలను మళ్లీ మళ్లీ మోసం చేయడమే అవుతుంది,దానికి ప్రజలు సిద్ధంగా లేరని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ సలహా దారులు అబ్దుల్ రబ్ జామి,చైర్మన్ రాంబల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్,కో ఆర్డినేటర్ తిరుమలయ్య, కో కన్వీనర్లు అర్జునప్ప, రవీంద్రనాథ్, నాయకులు రాజేందర్ రెడ్డి, శ్రీధరా చారి, తదితరులు పాల్గొన్నారు

మహనీయుల విగ్రహాలకు అడ్డంగా పంచాయతీ భవనమా.?

నిర్మాణ స్థలంపై పునరాలోచించాలి.. గ్రామ ప్రజల ఆందోళనకు పసుపుల ప్రశాంత్ మద్దతు



షాద్ నగర్,(ప్రజావినికిడి): నియోజకవర్గంలోని కొందుర్గు మండలంలోని అగిర్యాల్ గ్రామంలో చెరువు కట్టపై ఉన్న ఎనిమిది మంది మహనీయుల విగ్రహాలకు అడ్డంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం చేపట్టడంపై గ్రామ ప్రజలు వ్యక్తం చేస్తున్న ఆందోళనకు పసుపుల ప్రశాంత్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా రాజేష్,భిక్షపతి, రాజు తదితరులు ఆయనతో కలిసి నిర్మాణ స్థలంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా పసుపుల ప్రశాంత్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రభుత్వ స్థలాలకు కొదవలేదా? గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మరో అనువైన స్థలం అందుబాటులో లేదా? ఎనిమిది మంది మహనీయుల విగ్రహాలకు అడ్డంగా ఇదే ప్రాంతంలో భవనం నిర్మించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. మహనీయుల చరిత్ర,వారి పోరాటాలు, సమాజానికి చేసిన త్యాగాల విలువ తెలిసినవారెవరూ వారి విగ్రహాల గౌరవానికి భంగం కలిగించే నిర్ణయాలు తీసుకోరని అన్నారు.ఇది కేవలం భవన నిర్మాణ సమస్య మాత్రమే కాదని, మహనీయుల పట్ల గౌరవం, గ్రామ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు.
అంతేకాకుండా నిర్మాణ ప్రాంతం చెరువు బఫర్ జోన్ పరిధిలో ఉందనే అభ్యంతరాలు ఉన్నాయని,భవనం కింద నుంచే కాలువ ప్రవహిస్తున్న నేపథ్యంలో నిబంధనలను పరిశీలించకుండా నిర్మాణం చేపట్టడం ఎలా సమంజసమని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.
హైదరాబాద్‌లో హైడ్రా వ్యవహారం,
షాద్‌నగర్‌లో సిద్ధాపూర్ డంపింగ్ యార్డు, ఏలికట్ట ప్రాంతంలోని డేటా కేంద్రాల అంశాలు ఇప్పటికే ప్రజల్లో చర్చకు దారితీశాయని, ఇప్పుడు గ్రామ ప్రజల అభిప్రాయాలను కూడా పట్టించుకోకుండా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

ప్రభుత్వం స్పందించి నిర్మాణం స్థలంపై పునరాలోచన చేయాలి.

ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ భవన నిర్మాణ స్థలంపై పునరాలోచించాలని, మహనీయుల విగ్రహాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా మరో అనువైన ప్రభుత్వ స్థలంలో భవనాన్ని నిర్మించాలని కోరారు. ప్రజలమనోభావాలకు,అభిప్రాయాలకు ప్రభుత్వం గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రభుత్వం కొనసాగిస్తే రానున్న ఎన్నికల్లో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని పసుపుల ప్రశాంత్ హెచ్చరించారు.

కందికంటి ప్రేమ్‌నాథ్ గౌడ్ ఆధ్వర్యంలో
ఘనంగా రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు





ఎల్బీనగర్,(ప్రజావినికిడి): నవంబర్ 9, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గడ్డి అన్నారం మాజీ కౌన్సిలర్ కందికంటి ప్రేమ్‌నాథ్ గౌడ్ ఆధ్వర్యంలో గడ్డి అన్నారం డివిజన్‌లోని ప్రభుత్వ మహిళా అంధుల హాస్టల్‌లో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా కందికంటి ప్రేమ్‌నాథ్ గౌడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని, ఆయనకు భగవంతుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డి జగన్ యాదవ్, బబ్బురి ఆనంద్ కుమార్ గౌడ్, ఒక్కలంక శ్రీనివాస్,వన్నాడి శ్రీనివాస్,బాలా గౌడ్,ద్వారక మహి,రాజేష్ యాదవ్,వేణు మాధవరెడ్డి, ధర్మరాజు,గండి ప్రణవ్,అనిల్ గౌడ్,సామ సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, విక్కీ సురేందర్, కందికంటి పండరినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసైన భర్త వేధింపులు

కూతురుతో సహా రైలు పట్టాలపై ఆత్మహత్య కు ప్రయత్నించిన మహిళ

సకాలంలో స్పందించి ఇరువురిని కాపాడిన ఘట్కేసర్ పోలీసులు





ఘట్కేసర్,(ప్రజావినికిడి):
రోజు మద్యం తాగి వచ్చి మద్యం మత్తులో భర్త పెట్టే వేధింపులు భరించలేక దీపావళి పండుగ రోజు జీవితం మీద విరక్తి చెందిన ఓ మహిళ తన కూతురు సహా రైలు పట్టాలపై ఆత్మహత్యయత్నానికి పాల్పడింది.కాగా సకాలంలో స్పందించిన ఘట్కేసర్ పోలీసులు తల్లీ కూతుళ్ళను రక్షించారు. వివరాల్లోకి వెళితే...ఎల్బీనగర్ కు చెందిన మహేష్,మమత లు ఘట్కేసర్ ఎన్ఎఫ్సి నగర్ లో నివాసం ఉంటున్నారు. మహేష్ ఓ పెట్రోల్ పంపు లో పనిచేస్తుండగా, మమత (33) జోడిమెట్ల లోని ఓ కంపెనీ లో పనిచేస్తుంది. కాగా మద్యానికి బానిసైన మహేష్ రోజు తాగివచ్చి వేధింపులకు గురి చేస్తుండడంతో తన కూతురితో సహా స్థానికంగా ఉన్న రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకోవడానికి పరుగులు పెట్టింది.ఈ విషయాన్ని గమనించిన స్థానికులు 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వగా, ఘట్కేసర్ పాట్రోల్-2 కు చెందిన హెడ్ కానిస్టేబుల్ పరమేష్,ఇతర సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని చాకచక్యంగా వ్యవహరించి తల్లీ కూతుళ్ళను రక్షించారు. అనంతరం మమత కు కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు ఎన్ఎఫ్సి నగర్ కు చెందిన మమత సోదరి మౌనిక కు తల్లీ కూతుళ్ళను అప్పగించారు. కాగా సకాలంలో స్పందించి తల్లీ కూతుళ్ళను కాపాడిన హెడ్ కానిస్టేబుల్ పరమేష్ ఇతర సిబ్బందిని ఘట్కేసర్ సీఐ పెండ్యాల కిరణ్ ప్రత్యేకంగా అభినందించారు. అనుక్షణం ప్రజల భద్రత కొరకు పోలీసు శాఖ పనిచేస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ కిరణ్ పిలుపునిచ్చారు.

టిపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ కరుణాకర్ వినతి



షాద్ నగర్,(ప్రజావినికిడి): రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఆర్‌టీఎఫ్) బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నాయని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ కరుణాకర్ పేర్కొన్నారు.ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి టిపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో ఒకవైపు విద్యార్థులు,మరోవైపు కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలల నిర్వహణ కూడా భారంగా మారుతోందని తెలిపారు. సమస్య తీవ్రతను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ కరుణాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఏఎస్ డిడి ఓటర్లు మరో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

షాద్ నగర్ ఆర్డీఓ ఎన్.ఆర్. సరిత



షాద్ నగర్,(ప్రజావినికిడి):
షాద్ నగర్ నియోజకవర్గంలో వివిధ కారణాల వల్ల అబ్సెంట్, షిఫ్టెడ్,డెత్,డబుల్ కేటగిరీలలో ఏఎస్ డిడి చేర్చబడిన ఓటర్లకు మరోసారి ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించినట్లు 84-షాద్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి,ఆర్డీఓ ఎన్.ఆర్.సరిత తెలిపారు.సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ, ఏఎస్ డిడి జాబితాలను సంబంధిత ఏఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులతో పాటు అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.ఏఎస్ డిడి జాబితాలో తమ పేర్లు ఉన్న ఓటర్లు సంబంధిత జాబితాలను పరిశీలించుకొని,తమ వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు.నియోజకవర్గ పరిధిలోనే నివసిస్తూ,గతంలో ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించలేకపోయిన ఓటర్లు ప్రస్తుతం ఎన్యూమరేషన్ ఫారంతో పాటు (అనుబంధం-బి) ను సంబంధిత బీఎల్వో లేదా సూపర్వైజర్‌కు సమర్పించాలని, వారు అందుబాటులో లేని పక్షంలో సంబంధిత ఏఈఆర్వోకు అందజేయాలని సూచించారు.అదేవిధంగా, షాద్‌నగర్ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండి,ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు తమ ప్రస్తుత నివాస ప్రాంతంలోని సంబంధిత బీఎల్వో లేదా ఎన్నికల అధికారికి ఎన్యూమరేషన్ ఫారంతో పాటు (అనుబంధం-సి) ను సమర్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమాచారం అందించి,ఏఎస్ డిడి జాబితాలను వారికి కూడా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల సహకారం తీసుకోవాలని,ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మూడుసార్లు ప్రచారం నిర్వహించడంతో పాటు వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా సమాచారాన్ని చేరవేస్తామని తెలిపారు.కావున ఏఎస్ డిడి జాబితాలో పేర్లు ఉన్న అర్హులైన ఓటర్లు ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకొని,అవసరమైన పత్రాలతో ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించాలని ఆర్డీవో ఎన్.ఆర్.సరిత కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల నాయబ్ తహసీల్దార్ బాలవర్ధన్ పాల్గొన్నారు.



దీపావళి సందర్భంగా వనస్థలిపురం హుడా సాయి నగర్ కాలనీ నందు టపాసులు కాల్చుతున్న దృశ్యాలు

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా మూడవసారి గోపగాని మాధవి ఎన్నిక.



నల్లగొండ. నవంబర్ 9(ప్రజావినికిడి):
నల్లగొండ జిల్లా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా గోపగాని మాధవిని మూడవసారి నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సోమవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. గోపగాని మాధవి గత రెండు పర్యాయాలు జిల్లా మహిళా అధ్యక్షురాలుగా జిల్లాలో మహిళా కాంగ్రెస్ ను విస్తృతపరిచి పార్టీ కార్యక్రమాలను పార్టీ పిలుపును అనుసరించి అనేక కార్యక్రమాలు విజయవంతం చేశారు. ఆమె పార్టీకి చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం మూడోసారి కూడా అధ్యక్షురాలుగా ప్రకటించారు.ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆదేశానుసారం పార్టీని బలోపేతం చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడానికి నిరంతరం పనిచేస్తామన్నారు. కాగా మాధవి నియామకం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు అభిమానులు హర్షం వ్యక్తం చేశారు

ఊపిరి సలపనీయని బాకీలు..

బయట బిల్డప్ రాజులు.. లోపల అప్పుల బాధలు!

సంపాదన కోసం పరుగులు.. కుటుంబ పోషణ కోసం పోరాటం.. వడ్డీల ఊబిలో విలవిలలాడుతున్న మధ్యతరగతి బతుకులు!



నేటి సమాజంలో మనిషి విలువను అతని వ్యక్తిత్వంతో కాకుండా ఆర్థిక స్థితిగతులతో కొలుస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. చేతిలో డబ్బు ఉన్నప్పుడు చుట్టూ బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల సందడి. ఒక్కసారి ఆర్థిక ఇబ్బందుల్లో పడితే మాత్రం పలకరించడానికి కూడా వెనుకడుగు వేసే మనుషులు. అప్పు అడిగినప్పుడు కనిపించిన ఆప్యాయత.. తిరిగి చెల్లించే సమయం వచ్చేసరికి ద్వేషంగా మారుతున్న చేదు అనుభవాలు ఎన్నో కుటుంబాలను వెంటాడుతున్నాయి.
డబ్బు సంపాదించాలనే తపనలో కొందరు నిత్యం పరుగులు తీస్తున్నారు. కుటుంబాన్ని పోషించాలి.. పిల్లల చదువులు సాగించాలి.ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులు, నిత్యావసరాలు తీర్చాలి. ఈ బాధ్యతల మధ్య ఆదాయం సరిపోక అప్పుల బాట పడుతున్నారు. ఒక అప్పు తీర్చేందుకు మరో అప్పు.దానికి వడ్డీ. ఆ వడ్డీపై మళ్లీ అప్పు! ఇలా తెలియకుండానే అప్పుల చక్రబంధంలో చిక్కుకుని ఊపిరి సలపని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.
ఇక బయట ప్రపంచానికి మాత్రం కొందరి జీవితం ఎంతో ఆడంబరంగా కనిపిస్తుంది. ఖరీదైన దుస్తులు, హంగులు, ఆర్భాటాలు, గొప్పలకు పోయే మాటలు. పైకి చూస్తే బిల్డప్ రాజుల్లా కనిపిస్తారు. కానీ ఆ మెరుపుల వెనుక అప్పుల చిట్టా, వడ్డీల బాధలు, ఆర్థిక ఒత్తిళ్లు దాగి ఉంటాయి. సమాజంలో పరువు పోకూడదనే భయంతో తమ కష్టాలను బయటపెట్టలేక లోలోపల కుమిలిపోతుంటారు.అప్పు తీసుకోవడం తప్పు కాదు. ఆదాయానికి మించి ఖర్చులు చేయడం, అవసరానికి మించిన ఆడంబరాలకు పోవడం, తిరిగి చెల్లించే ఆలోచన లేకుండా అప్పులు చేయడం కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుంది. అదే సమయంలో అప్పు ఇచ్చినవారు కూడా మానవత్వం మరచి అవమానించడం, బెదిరించడం, బహిరంగంగా పరువు తీయడం సమస్యను మరింత జటిలం చేస్తుంది. అప్పు అనేది ఆర్థిక లావాదేవీ మాత్రమే.. మనిషి ఆత్మగౌరవాన్ని కించపరిచే ఆయుధం కాకూడదు.ముఖ్యంగా కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్న సామాన్యుడి పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. రోజంతా సంపాదించినా చేతిలో మిగిలేది శూన్యం. వచ్చిన ఆదాయం అప్పుల వడ్డీలకే సరిపోతోంది. ఇంట్లో కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వలేక, బయట అప్పుల వారి ఒత్తిడిని తట్టుకోలేక మానసికంగా కుంగిపోతున్నారు. అయినా సమాజం ముందు నవ్వుతూ నటించాల్సిన దుస్థితి!ఇప్పటికైనా మనిషి తన ఆర్థిక స్థాయిని మించి జీవించాలనే ఆలోచనకు స్వస్తి పలకాలి. సంపాదనకు తగ్గ ఖర్చులు, అవసరాలకు ప్రాధాన్యం, ఆడంబరాలకు దూరం. ఇవే ఆర్థిక స్థిరత్వానికి పునాదులు. కుటుంబ సభ్యుల మధ్య ఆర్థిక పరిస్థితులపై స్పష్టత ఉండాలి. అప్పుల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.
చివరగా ఒక్క ప్రశ్న. మనిషికి నిజమైన గౌరవం అతని ఒంటిపై ఉన్న ఖరీదైన దుస్తుల్లోనా? చేతిలో కనిపించే డబ్బులోనా? లేక అప్పుల్లేని ప్రశాంతమైన జీవితంలోనా? బయట బిల్డప్ రాజులుగా కనిపించడం గొప్ప కాదు.. లోపల అప్పుల బాధలు లేకుండా కుటుంబంతో ప్రశాంతంగా బతకడమే అసలైన సంపద. ఆడంబరాల కోసం అప్పులు చేసి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే బతుకులకు ఇకనైనా స్వస్తి పలకాలి!

సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





ఎల్బీనగర్,(ప్రజావినికిడి):
సదర్ సందర్భంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తన కుటుంబసభ్యులచే కలిసి కొత్తపేట గ్రామం నందు జరిగిన సదర్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తా

బీఆర్ఎస్‌ను మహిళలు ప్రశ్నించాలి.. వాత పెట్టాలి

కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ -కొడంగల్‌లో పుట్టినరోజు వేడుకలు

వికారాబాద్, నవంబర్ 9(ప్రజావినికిడి):
ఆడబిడ్డల ఆశీర్వాదమే తనకు శక్తి అని, వారి వల్లే తాను ఈ స్థాయికి ఎదిగానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఆదివారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేట ఎడ్యుకేషన్ హబ్‌లో మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం– మహిళా స్వయం సహాయక బృందాలతో ముఖాముఖి కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత, గీత కార్మికులకు కొత్తగా మంజూరు చేసిన 4.50 లక్షల పింఛన్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మహిళలు కేవలం సంఘాల సభ్యులుగా కాకుండా వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెడితే రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబెట్టినట్టేనన్నారు. “మహిళా శక్తే.. నా శక్తి. అందుకే మీ అందరి మధ్య నా పుట్టినరోజు నిర్వహించుకోవాలని ఇక్కడకు వచ్చాను. ఆడ బిడ్డల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తా. నా పుట్టినరోజును మహిళా శక్తికి అంకితం చేస్తున్నా” అని రేవంత్‌రెడ్డి అన్నారు.
ఆడబిడ్డ నిలబడితే కుటుంబం నిలబడుతుందని, అందుకే ప్రతీ ప్రభుత్వంపథకాన్ని మహిళల పేరుతోనే అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ నెల 19న ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని కోటి మంది ఆడబిడ్డలకు సారెగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నామని తెలిపారు. “ఆడబిడ్డలను ఉన్నత చదువులు చదివించండి. ఆడపిల్లకు వెంటనే పెళ్లి చేయవద్దు. బాగా చదువుకుని తన కాళ్ల మీద తాను నిలబడితే ఇంటికి క్యూ కట్టి.. ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకుంటారు” అని సీఎం అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 2,842 మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.306 కోట్లు చెక్కు, కొడంగల్ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ పంప్, ఈవీ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు రూ.కోటి మంజూరు పత్రం, కోస్గి, గుండుమల్





మండల సమాఖ్యలకు సోలార్ పవర్ యూనిట్ల స్థాపన కోసం రూ.2.07 కోట్ల చెక్కు, జిల్లాలో 2001 మంది కొత్త పింఛన్‌దారులకు పెన్షన్ మంజూరు పత్రాలు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రసంగం ముగిసిన తర్వాత వేదిక పైనుంచి కిందకు వచ్చి మహిళలను కలిశారు. ముఖ్యమంత్రికి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పేందుకు మహిళలు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనరసింహా, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చెల్లిని గెంటేసిన దుర్మార్గుడు..
కేటీఆర్ సొంత చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని ఆమెను ఇంటి నుంచి బయటకు గెంటేసిన దుర్మార్గుడని సీఎం రేవంత్ అన్నారు. అలాంటి వ్యక్తి మహిళలను ఉద్ధరిస్తానంటున్నారని ఎద్దేవా చేశారు. “చింపిరి గడ్డమేసుకుని ఊరూరు తిరుగుతున్నాడు. సొంత చెల్లెలే ఆయనను దగుల్బాజీ అంటోంది. చెల్లి ఏదైనా తప్పు చేసినా క్షమించి అక్కున చేర్చుకునేవాడే అన్న. కేటీఆర్ మాత్రం జైలు నుంచి వచ్చిన చెల్లిని బయటకు పంపించేశాడు. రాఖీ పండగ రోజు ఇక్కడ ఉంటే రాఖీ కడుతుందోమోనని విదేశాలకు వెళ్లాడు. మంచీ చెడు చెప్పాల్సిన తండ్రి ఫాంహౌస్‌లో పడుకున్నాడు” అని సీఎం విమర్శించారు. పదేళ్లు అధికారం ఇస్తే ఏమిచ్చారో అడగండని సూచించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తే.. కళ్లలో నిప్పులు పోసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆటో డ్రైవర్లతో పంచాయతీ పెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. వారు వచ్చినప్పుడు నిలదీయాలని, రొట్టెలు కాల్చే కడ్డీని ఎర్రగా కాల్చి.. వాత పెట్టాలని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం, పరిశోధనాత్మక ఆలోచన విధానాన్ని పెంపొందించే లక్ష్యంతో సర్ సీవీ రామన్ సైన్స్ మ్యూజియాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో రూ.6.06 కోట్లతో నిర్మించిన సైన్స్ మ్యూజియాన్ని ఆదివారం విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. మ్యూజియంలో వివిధ గ్యాలరీలను సందర్శించారు.



తెలంగాణలో బావుల పునరుద్ధరణకు ‘మీ బావి‘ ఉద్యమం ప్రారంభం

వారసత్వ పరిరక్షణ సంస్థ అకర్మా ఆధ్వర్యంలో బృహత్ కార్యక్రమం

నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు బావులను జలవనరులుగా మార్చడమే లక్ష్యం

అవగాహన కల్పించేందుకు కేబీఆర్ పార్కులో ఫోటో ఎగ్జిబిషన్, చర్చాగోష్ఠి ఏర్పాటు

ఇప్పటికే పునరుద్ధరించిన బావులతో ఏటా 500 లక్షల లీటర్ల నీరు భూమిలోకి ఇంకుతోందని వెల్లడి



నవంబర్ 9 (ప్రజావినికిడి):
రాష్ట్రంలో తీవ్రమవుతున్న నీటి సంక్షోభం, వేగంగా అడుగంటుతున్న భూగర్భ జలాల సమస్యను అధిగమించేందుకు హైదరాబాద్ నగరానికి చెందిన వారసత్వ పరిరక్షణ సంస్థ “అకర్మా“ నడుం బిగించింది. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వందలాది చారిత్రక బావులను పరిరక్షించి, పునరుద్ధరించే లక్ష్యంతో “మీ బావి“ పేరుతో ఓ ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. నిర్లక్ష్యానికి గురైన ఈ వారసత్వ కట్టడాలకు చట్టపరమైన రక్షణ కల్పించి, వాటిని క్రియాశీల జల వనరులుగా, భూగర్భ జల రీఛార్జ్ వ్యవస్థలుగా మార్చడమే ఈ ఉద్యమం ప్రధాన ఉద్దేశం.
హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి రోజురోజుకు తీవ్రమవుతోంది. ముఖ్యంగా “సూపర్ ఎల్ నినో“ ప్రభావంతో ఈ సమస్య మరింత జఠిలంగా మారిందని అకర్మా సంస్థ విశ్లేషిస్తోంది. ఈ నేపథ్యంలో, సాంప్రదాయ నీటి నిల్వ పద్ధతులైన బావులను పునరుజ్జీవింపజేయడం ద్వారా సుస్థిర పరిష్కారం కనుగొనవచ్చని సంస్థ భావిస్తోంది. కేవలం బావులను బాగుచేయడమే కాకుండా, ప్రభుత్వ విధానాల్లో మార్పులు తీసుకురావడం, ప్రజలు, ఇతర భాగస్వాములను ఇందులో కలుపుకొనిపోవడం ద్వారా శాశ్వత ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.ఇప్పటికే తాము పరిరక్షించిన కొన్ని బావుల ద్వారా ఏటా 500 లక్షల లీటర్లకు పైగా నీరు భూమిలోకి ఇంకి, భూగర్భ జలమట్టం పెరగడానికి దోహదపడుతోందని అకర్మా సంస్థ ప్రతినిధులు తెలిపారు. నీటిని కేవలం వినియోగ వస్తువుగా కాకుండా, అందరి ఉమ్మడి వారసత్వ సంపదగా చూడాలని, దాని సంరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఈ ఉద్యమం పిలుపునిస్తోంది.ఈ ఉద్యమంలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 13న సాయంత్రం 4:30 గంటలకు బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో బావుల పరిరక్షణపై ఓ ప్రత్యేక చర్చాగోష్ఠి ఏర్పాటు చేశారు. దీంతో పాటు, కేబీఆర్ పార్కుతో పాటు ఇతర ప్రజా ప్రదేశాలలో చారిత్రక బావుల ఛాయాచిత్ర ప్రదర్శనను కూడా నిర్వహించనున్నారు. తద్వారా సాంప్రదాయ నీటి నిల్వ సాంకేతికత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించనున్నారు.

ప్రజావినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

చదివితే ఉద్యోగం ఖాయమనే రోజులు పోయాయా?

చైనా ఉదాహరణతో భారత యువతకు వెంబు హెచ్చరిక

నవంబర్ 9(ప్రజావినికిడి):

చదువుకుంటే మంచి ఉద్యోగం.. ఉద్యోగం వస్తే స్థిరమైన జీవితం.. ఇదే ఇప్పటివరకు యువతకు చెబుతున్న మాట. కానీ మారుతున్న పరిస్థితులు ఈ నమ్మకాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆటోమేషన్ కారణంగా సంప్రదాయ ఉద్యోగాలకు సవాళ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చైనాలో నిరుద్యోగ సమస్యను ప్రస్తావిస్తూ జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు కీలక వ్యాఖ్యలు చేశారు. యువత ఉద్యోగాలపైనే ఆధారపడకుండా వ్యాపారాలు, స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారు.చైనాలో యువత నిరుద్యోగ సమస్యపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో జరుగుతున్న చర్చకు వెంబు స్పందించారు. దశాబ్దాలుగా అక్కడి యువతకు ఒక భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. బాగా చదివితే మంచి ఉద్యోగం వస్తుందని, తల్లిదండ్రుల కంటే మెరుగైన జీవితం గడపవచ్చని నమ్మించారని గుర్తుచేశారు. అయితే ఆ భరోసా ఇప్పుడు క్రమంగా




దెబ్బతింటోందన్నారు.ప్రపంచానికి తయారీ కేంద్రంగా ఉన్న చైనా.. అనేక రంగాల్లో సాంకేతికంగా అభివృద్ధి సాధించిందని వెంబు పేర్కొన్నారు. ఏటా 1.2 లక్షల కోట్ల డాలర్ల సరుకుల వాణిజ్య మిగులును నమోదు చేస్తున్నప్పటికీ.. పట్టభద్రులైన యువతకు తగిన ఉద్యోగాలు కల్పించలేకపోతోందని వివరించారు. చైనాలో 20-24 ఏళ్ల వయసున్న నిరుద్యోగుల్లో దాదాపు 70 శాతం మంది యూనివర్సిటీ డిగ్రీలు పొందినవారేనని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా విద్యా, ఆర్థిక వ్యవస్థలు స్థిరమైన జీతం వచ్చే ఉద్యోగాల కోసమే యువతను సిద్ధం చేస్తున్నాయని వెంబు అన్నారు. అయితే ఆటోమేషన్, ఏఐ కారణంగా అలాంటి ఉద్యోగాలకే ముప్పు పెరుగుతోందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్నారు.ఈ పరిస్థితిని ఎదుర్కోవాలంటే వ్యాపారవేత్తల సంఖ్య పెరగాలని, స్వయం ఉపాధికి ప్రాధాన్యం ఇవ్వాలని వెంబు సూచించారు. అమెరికాలోనూ 20వ శతాబ్దం మధ్యకాలానికి ముందు చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారంగా నిలిచాయని గుర్తుచేశారు. భారీ సంస్థల్లో స్థిరమైన జీతాల ఉద్యోగాలు ఆధిపత్యం చెలాయించడం ఇటీవలి పరిణామమేనని పేర్కొన్నారు. ఈ మార్పులను గుర్తించి భారత విధాన నిర్ణేతలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్విడియా సీఈఓతో గూఢచారి ఎఫైర్ కలకలం..

జెన్సన్ హువాంగ్‌పై గూఢచర్యం ఆరోపణలను ఖండించిన చైనా

నవంబర్ 9 (ప్రజావినికిడి):



అమెరికా టెక్ దిగ్గజం ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌పై గూఢచర్యం జరిగిందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఆయనను లక్ష్యంగా చేసుకుని విదేశీ నిఘా ప్రయత్నాలు జరిగాయన్న వార్తలపై ఎన్విడియా దర్యాప్తు ప్రారంభించింది. ఈ వ్యవహారంలో చైనా ప్రమేయం ఉందన్న ఆరోపణలను ఆ దేశం తీవ్రంగా ఖండించింది. అదంతా నిరాధార ప్రచారమని స్పష్టం చేసింది.గూఢచర్యం ఆరోపణలపై చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ స్పందించారు. ఆలిస్ చైనా గూఢచారి అంటూ వస్తున్న కథనాల్లో ఏమాత్రం నిజం లేదన్నారు. తమ దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేస్తున్న తప్పుడు ప్రచారమని పేర్కొన్నారు.ఎన్విడియా వ్యవస్థాపకుడు, సీఈఓ జెన్సన్ హువాంగ్ విదేశీ నిఘా ప్రయత్నాలకు లక్ష్యంగా మారారన్న వార్తల నేపథ్యంలో సంస్థ బోర్డు విచారణ చేపట్టింది. గతేడాది అమెరికా జరిపిన దర్యాప్తులో ఆలిస్ హువాంగ్ అనే చైనా వ్యాపారవేత్త పేరు తెరపైకి వచ్చింది. ఆమె జెన్సన్ హువాంగ్‌పై నిఘా పెట్టేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో ఆమె మెగాస్పీడ్ ఇంటర్నేషనల్‌లో కీలక బాధ్యతల్లో ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి.ఈ వ్యవహారంలో సింగపూర్‌కు చెందిన ఏఐ డేటా సెంటర్ సంస్థ మెగాస్పీడ్‌పైనా ఆరోపణలు వచ్చాయి. ఎన్విడియా చిప్‌లను తాము అక్రమంగా చైనాకు తరలించినట్టు జరిగిన ప్రచారాన్ని ఆ సంస్థ ఖండించింది. అమెరికా, మలేషియా అధికారులు, ఎన్విడియా నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి అక్రమాలకు ఆధారాలు లభించలేదని తెలిపింది.బ్లూమ్‌బెర్గ్ కథనంలో తమ కార్యకలాపాలపై తప్పుదారి పట్టించే సమాచారం ఉందని మెగాస్పీడ్ పేర్కొంది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ఎన్విడియా కంప్యూటింగ్ పవర్ క్లౌడ్ వ్యాపారానికి తాము కీలక భాగస్వామినని వెల్లడించింది. సింగపూర్, మలేషియా, ఇండోనేషియాల్లో కార్యాలయాలు ఉన్నాయని తెలిపింది.

ఆన్‌లైన్‌లో టీటీడీ 2027 క్యాలెండర్లు, డైరీల బుకింగ్ ప్రారంభం

నవంబర్ 9(ప్రజావినికిడి):



రాబోయే నూతన సంవత్సరం 2027ను పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తుల కోసం ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రతి ఏటా విశేష ఆదరణ పొందే టీటీడీ డైరీలు, క్యాలెండర్లను భక్తులు ఈసారి తమ ఇళ్ల నుంచే సులభంగా పొందేలా ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని ప్రారంభించింది.శ్రీవారి భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ttdevasthanams.ap.gov.in ద్వారా 2027 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లు, డైరీలను నేరుగా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకోవచ్చని దేవస్థానం అధికారులు వెల్లడించారు.ఆన్‌లైన్ సదుపాయంతో పాటు భక్తుల సౌకర్యార్థం ప్రత్యక్ష విక్రయ కేంద్రాలను కూడా టీటీడీ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచింది. తిరుపతి, తిరుమల, తిరుచానూరు పరిధిలోని టీటీడీ ప్రచురణల విక్రయ విభాగానికి చెందిన 12 ప్రత్యేక కౌంటర్లలో వీటిని భక్తులు కొనుగోలు చేయవచ్చు. అంతేకాకుండా, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రధాన నగరాల్లోని భక్తుల కోసం స్థానిక టీటీడీ సమాచార కేంద్రాల్లోనూ వీటి విక్రయాలు జరుగుతున్నాయి.

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్ కేంద్రాలతో పాటు విజయవాడ, చెన్నై, వెల్లూరు, బెంగళూరు, న్యూఢిల్లీ, ముంబై నగరాల్లోని టీటీడీ సమాచార కేంద్రాల్లో ఈ క్యాలెండర్లు, డైరీలు లభ్యమవుతున్నాయి.కాగా, 2027 నూతన సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీలు, క్యాలెండర్లను 2026 సెప్టెంబరు 7వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఆవిష్కరణ జరిగిన నాటి నుంచే ప్రత్యక్ష కేంద్రాల్లో వీటి విక్రయాలు వేగంగా సాగుతున్నాయి. భక్తుల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తాజాగా ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని సైతం విస్తృతం చేశారు.

శ్రీవారి భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అధికారిక వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవాలని లేదా సమీపంలోని సమాచార కేంద్రాల వద్ద వీటిని కొనుగోలు చేయాలని టీటీడీ ప్రధాన ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

అమ్మవారి నాణెం కోసం పోటెత్తిన భక్తులు..

చార్మినార్ వద్ద బారులు తీరిన భక్తులు

నవంబర్ 9 (ప్రజావినికిడి)::




దీపావళి పండగ సందర్భంగా చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. అమ్మవారి ఖజానా నుంచి నాణేల పంపిణీ ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆదివారం సాయంత్రం మొదలైన ఈ పంపిణీ కోసం భక్తులు బారులు తీరారు. గుల్జార్ హౌస్ వరకు క్యూలైన్లు విస్తరించాయి.భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ నిర్వాహకులు నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నాణేలు పంపిణీ చేస్తున్నారు. అమ్మవారి ఖజానా నుంచి లభించే నాణెం ఇంటికి తీసుకెళ్తే శుభాలు కలుగుతాయని, సిరిసంపదలు పెరుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఈ నమ్మకంతో ప్రతి ఏటా దీపావళి సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో వస్తుంటారు.మూడు రోజుల పాటు అమ్మవారి ఖజానా నుంచి నాణేల పంపిణీ కార్యక్రమం కొనసాగనుంది. దీంతో రానున్న రెండు రోజుల్లోనూ ఆలయానికి భక్తుల రాక మరింత పెరిగే అవకాశం ఉంది.

గాలి కాలుష్యం దెబ్బ..

అండాలు, వీర్యకణాలపైనా ప్రభావం!

నవంబర్ 9 (ప్రజావినికిడి):



నగరాల్లో పెరుగుతున్న వాయు కాలుష్యం ఊపిరితిత్తులకే కాదు.. సంతానోత్పత్తి ఆరోగ్యానికీ ముప్పుగా మారుతోందా? ముఖ్యంగా ఫెర్టిలిటీ పరీక్షల్లో వచ్చే ఫలితాలపై కాలుష్యం ప్రభావం చూపిస్తోందా? ఇటీవలి పరిశోధనలు ఈ ప్రశ్నలకు ఆసక్తికరమైన సమాధానాలు చెబుతున్నాయి. గాలిలోని సూక్ష్మ ధూళి కణాలు, ప్లాస్టిక్ ఉత్పత్తుల్లో ఉండే కొన్ని రసాయనాలు హార్మోన్ల పనితీరు, అండాల నాణ్యత, వీర్యకణాల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశముందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అయితే పరీక్షల్లో వచ్చే ప్రతికూల ఫలితాలకు కాలుష్యమే కారణమని నిర్ధారించలేమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మహిళల హార్మోన్లపై ప్రభావం

2026లో 'కమ్యూనికేషన్స్ మెడిసిన్' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం 1,79,972 మంది మహిళల వివరాలను విశ్లేషించింది. భారత్‌లో నిర్ణయించిన ప్రమాణం కంటే ఎక్కువగా పీఎం2.5 కాలుష్యానికి గురైన మహిళల్లో రుతుస్రావం ఆలస్యంగా ప్రారంభమయ్యే అవకాశాలు 24 శాతం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించింది. అలాగే ముందుగానే మెనోపాజ్ వచ్చే ముప్పు 23 శాతం అధికంగా ఉన్నట్లు వెల్లడించింది. అయితే ఇది పరిశీలనాత్మక అధ్యయనం మాత్రమే. కాలుష్యమే ఈ మార్పులకు కారణమని నిర్ధారించలేదు.

అండాల నాణ్యతపైనా ప్రభావం?

ప్లాస్టిక్ వస్తువులు, కొన్ని వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల్లో ఉండే థాలేట్స్ హార్మోన్ల పనితీరును దెబ్బతీసే రసాయనాలుగా గుర్తింపు పొందాయి. 2024లో 245 మంది భారతీయ మహిళలపై జరిగిన అధ్యయనంలో ఈ రసాయనాలకు సంబంధించిన కొన్ని పదార్థాలు అండాశయ నిల్వ సామర్థ్యం, అండాల సేకరణ ఫలితాలతో సంబంధం కలిగి ఉన్నట్లు తేలింది. అయితే అన్ని రసాయనాల విషయంలో ఒకే తరహా ఫలితాలు కనిపించలేదు.

వీర్యకణాలపైనా ప్రభావం

కాలుష్యం పురుషుల సంతానోత్పత్తి సామర్థ్యాన్నీ ప్రభావితం చేసే అవకాశం ఉంది. తైవాన్‌లో 6,475 మంది పురుషులపై 2018లో జరిగిన అధ్యయనం ప్రకారం.. పీఎం2.5 స్థాయిలు ప్రతి ఐదు మైక్రోగ్రాములు పెరిగినప్పుడు సాధారణ ఆకృతిలో ఉండే వీర్యకణాల శాతం 1.29 తగ్గినట్లు గుర్తించారు. అయితే వీర్యకణాల సంఖ్య మాత్రం పెరిగినట్లు అధ్యయనం వెల్లడించింది. అంటే కాలుష్య ప్రభావం అన్ని అంశాలపై ఒకేలా ఉండదని స్పష్టమవుతోంది.

కాలుష్యానికి దూరంగా ఉండేందుకు..

ఇంట్లో హెచ్ఈపీఏ ఫిల్టర్లు ఉన్న ఎయిర్ ప్యూరిఫయర్లు వాడటం, గాలి నాణ్యత సూచిక (ఏక్యూఐ) పరిశీలించి బయట వ్యాయామం చేయడం, అవసరమైనప్పుడు ఎన్95 మాస్కులు ధరించడం ద్వారా కాలుష్య ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. అయితే ఈ జాగ్రత్తలు పాటించడం వల్ల సంతానోత్పత్తి మెరుగవుతుందని ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు.

పరీక్షల ఫలితాలే అంతిమం కాదు

వీర్యకణాల నాణ్యతలో మార్పులు కనిపిస్తే మరోసారి పరీక్ష చేయాల్సి రావచ్చు. అలాగే ఏఎంహెచ్ పరీక్ష ఫలితాలను వయసు, అల్ట్రాసౌండ్ వివరాలు, వైద్య చరిత్రతో కలిపి పరిశీలించాలి. వాహనాల పొగ, పారిశ్రామిక ధూళి, రసాయనాలకు ఎక్కువగా గురయ్యేవారు ఆ వివరాలను వైద్యులకు తెలియజేయాలి. అవసరమైతే అదనపు పరీక్షలు సూచిస్తారు. కాలుష్య ప్రభావంపై పరిశోధనలు కొనసాగుతున్నప్పటికీ.. ఒక్క పరీక్ష ఆధారంగా సంతానోత్పత్తి సామర్థ్యంపై నిర్ణయానికి రాకూడదని నిపుణులు సూచిస్తున్నారు.

డాలర్‌పై రూపాయి జోరు..

ఒక్కరోజే 25 పైసలు బలోపేతం!

నవంబర్ 9 (ప్రజావినికిడి):



అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ పెరిగింది. సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో 25 పైసలు లాభపడి 93.68 స్థాయికి చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం మెరుగుపడటం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గవచ్చన్న ఆశలు రూపాయికి అండగా నిలిచాయి.గత వారం కూడా రూపాయి బలమైన ప్రదర్శన కనబరిచింది. 2026లోనే అత్యుత్తమ వారపు లాభాన్ని నమోదు చేస్తూ దాదాపు ఒక శాతం పుంజుకుంది. ఏప్రిల్ తర్వాత అత్యధిక స్థాయికి చేరింది. శుక్రవారం ఒక్కరోజే 43 పైసలు పెరిగి డాలర్‌తో పోలిస్తే 93.98 వద్ద ముగిసింది.సోమవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి 93.90 సమీపంలో ప్రారంభమై 93.70 స్థాయిలో ట్రేడవుతోంది. రూపాయి పుంజుకోవడానికి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు సుమారు 1.5 బిలియన్ డాలర్లు రావడం, అమెరికా డాలర్ బలహీనపడటం, చమురు ధరలు తగ్గడం కూడా దోహదపడ్డాయి. మరోవైపు సోమవారం బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 98.17 డాలర్ల వద్ద ట్రేడవుతూ 0.15 శాతం తగ్గింది.ఇరాన్ అణు కార్యక్రమం, హర్మూజ్ జలసంధిపై చర్చల్లో గణనీయమైన పురోగతి సాధిస్తే మరిన్ని సైనిక దాడులు జరిగే అవకాశం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వారాంతంలో సంకేతాలివ్వడం మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. అయితే అమెరికాలో ఉద్యోగ గణాంకాలు అంచనాలను మించడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచవచ్చన్న అంచనాలు బలపడ్డాయి. డిసెంబరులో వడ్డీ రేటు పెంపునకు 81 శాతం అవకాశముందని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి.

గిరి'జనం'లో జనసేనకు పట్టెంత.. ?

నవంబర్ 9(ప్రజావినికిడి):



: ఇటీవల కాలంలో గిరిజన ప్రాంతాలపై పట్టు పెంచుకునేందుకు జనసేన ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధిపై పెద్ద ఎత్తున దృష్టి పెట్టింది. జల్‌జీవన్ మిషన్ ద్వారా గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం.. అలాగే, రహదారుల నిర్మాణానికి, విద్యుత్ సరఫరా వంటి వ్యవస్థ వంటివి పునరుద్ధరిస్తున్నారు. దీంతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పెరుగుతోంది. మరి ఇదిఓటు బ్యాంకుగా మారిందా? గిరిజనుల హృదయాలను జనసేన కైవసం చేసుకుందా? చూద్దాం.. గతంలో కాంగ్రెస్‌కు.. తర్వాత వైసీపీకి అనుకూలంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో తాజాగా జరిగిన పరిషత్ పోరు జనసేనకు అనుకూలంగానే ఉందని చెప్పాలి ఒక్క పోలవరంవంటి ప్రాంతంలో మాత్రమే భిన్నమైన తీర్పు రాగా.. మిగిలిన గిరిజన ప్రాంతాల్లో సేనాని పట్టు నిలుపుకొన్నారు. గిరిజన ప్రాంతాల్లో జనసేన గణనీయమైన ప్రభావాన్ని చూపింది. అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో భాగంగా పోటీ చేసిన జనసేన, గ్రామీణ ఏజెన్సీ ప్రాంతాల్లో మెరుగైన స్థానాలను దక్కించుకుంది

గిరిజన ఏజెన్సీ నియోజకవర్గాలైన కురుపాం, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లా వంటి ప్రాంతాల్లో జనసేన అభ్యర్థులు స్థానిక గిరిజన ఓటర్ల మద్దతుతో మంచి విజయాన్ని సాధించారు. పోలవరంలో ఒకింత ఆశించిన మేరకు ఫలితం రాకపోవడం వెనుక ఎమ్మెల్యే ప్రభావం ఉందన్న చర్చ ఉంది. కానీ.. మిగిలిన ప్రాంతాల్లో ముఖ్యంగా పవన్‌తో గిరిజనులు కనెక్ట్ అయిన ప్రాంతాల్లో బలమైన తీర్పు వచ్చింది. మొత్తం పరిషత్ ఫలితాల్లో టీడీపీ తర్వాత కూటమిలో జనసేన పార్టీ అత్యధిక స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. ఈ ఎన్నికల్లో జనసేన 36 జడ్‌పీటీసీ స్థానాలను, 644కు పైగా ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుంది. మరీ ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలో జనసేన అభ్యర్థులు భారీ ఆధిక్యతను ప్రదర్శించారు. ఉదాహరణకు, పల్నాడు పరిధిలోని క్రోసూరు జడ్‌పీటీసీ స్థానంలో జనసేన అభ్యర్థి పమిడిపాటి శ్రీనివాసరావు రాష్ట్రంలోనే అత్యధికంగా 30,273 ఓట్ల రికార్డు మెజారిటీతో విజయం సాధించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంతాల అభివృద్ధి, గ్రామీణ ఉపాధి హామీ పథకాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం, డిప్యూటీ సీఎం హోదాలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలే ఈ విజయానికి ప్రధాన కారణమని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

దక్షిణాఫ్రికా పర్యటనకు భారత మహిళల జట్టు ప్రకటన



మూడు ఫార్మాట్లకు సారథిగా స్మృతి మంధాన..
జట్టులో జెమీమా రోడ్రిగ్స్‌కు చోటు

న్యూఢిల్లీ, నవంబర్ 9:దక్షిణాఫ్రికా పర్యటనలో తలపడనున్న భారత మహిళల క్రికెట్ జట్లను బీసీసీఐ ప్రకటించింది. డిసెంబర్‌లో జరగనున్న ఈ పర్యటనలో టెస్టు, వన్డే, టీ20 మూడు ఫార్మాట్లకు స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఈ పర్యటనలో భారత జట్టు ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది.గతంలో టెస్టు క్రికెట్‌లో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టని స్మృతి మంధానకు ఈ పర్యటనతో ఆ అవకాశం లభించింది. టెస్టు, వన్డే జట్లకు దీప్తి శర్మ వైస్ కెప్టెన్‌గా ఎంపికైంది. టీ20 జట్టుకు షఫాలీ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది.మోకాలి గాయం నుంచి కోలుకుని తిరిగి క్రికెట్‌లోకి వచ్చిన జెమీమా రోడ్రిగ్స్‌కు మూడు ఫార్మాట్ల జట్లలోనూ చోటు దక్కింది. గాయంతో కొంతకాలంగా జట్టుకు దూరమైన అమన్‌జోత్ కౌర్ టీ20 జట్టులోకి తిరిగి వచ్చింది. హర్మన్‌ప్రీత్ కౌర్, షఫాలీ వర్మ, రిచా ఘోష్, యాస్తికా భాటియా, హర్లీన్ డియోల్ తదితరులకు కూడా అవకాశం కల్పించారు.టెస్టు జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్, యాస్తికా భాటియా, దీప్తి శర్మ, శ్రీ చరణి, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలి సత్ఘరే.వన్డే జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్, యాస్తికా భాటియా, దీప్తి శర్మ, శ్రీ చరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలి సత్ఘరే.టీ20 జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, నికీ ప్రసాద్, రిచా ఘోష్, జి. కమలిని, అనుష్క శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి, ప్రేమ రావత్, అమన్‌జోత్ కౌర్, క్రాంతి గౌడ్, నందిని శర్మ, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, సయాలి సత్ఘరే.పర్యటన షెడ్యూల్: డిసెంబర్ 9న గ్కెబెర్హాలో ఏకైక టెస్టు మ్యాచ్‌తో పర్యటన ప్రారంభమవుతుంది. డిసెంబర్ 16న పార్లలో తొలి వన్డే, 19న కేప్‌టౌన్‌లో రెండో వన్డే, 22న బ్లోమ్‌ఫోంటెయిన్‌లో మూడో వన్డే జరుగుతాయి. డిసెంబర్ 26న బెనోనిలో తొలి టీ20, 29, 30 తేదీల్లో పోట్చెఫ్‌స్ట్రూమ్‌లో చివరి రెండు టీ20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు.మూడు ఫార్మాట్లలోనూ సత్తా చాటేందుకు భారత మహిళల జట్టు సిద్ధమవుతోంది. ఈ పర్యటనలో స్మృతి మంధాన నాయకత్వం, జెమీమా పునరాగమ నం, యువ క్రీడాకారిణుల ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

ముంబైకి అర్ష్‌దీప్.. పంజాబ్‌కు హార్దిక్!



ఐపీఎల్‌లో సంచలన ఆటగాళ్ల మార్పిడి..
ముంబైకి లాభమంటున్న అభినవ్ ముకుంద్

న్యూఢిల్లీ, నవంబర్ 9:ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య కీలక ఆటగాళ్ల మార్పిడి చర్చనీయాంశంగా మారింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు వెళ్లనుండగా, భారత ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు మారనున్నాడు. ఈ ఒప్పందంపై రెండు ఫ్రాంచైజీలు అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. అయితే బీసీసీఐ అధికారిక ఆమోదం, ఇతర ప్రక్రియలు పూర్తయిన తర్వాతే ఈ మార్పిడి ఖరారు కానుంది.**ముంబైకే ఎక్కువ ప్రయోజనం!**మాజీ భారత క్రికెటర్ అభినవ్ ముకుంద్ ఈ ఆటగాళ్ల మార్పిడిపై స్పందిస్తూ ముంబై ఇండియన్స్‌కే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డాడు. పంజాబ్ జట్టు అర్ష్‌దీప్, శ్రేయస్ అయ్యర్, యుజ్వేంద్ర చాహల్ వంటి కీలక ఆటగాళ్లపై పెట్టుబడి పెట్టిందని గుర్తుచేశాడు. ఇప్పుడు అర్ష్‌దీప్‌ను వదులుకుని హార్దిక్‌ను తీసుకోవడం జట్టు కూర్పుపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నాడు.**శ్రేయస్ నాయకత్వంలో హార్దిక్ ఎలా?**పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ కొనసాగనున్న నేపథ్యంలో ఆయన నాయకత్వంలో హార్దిక్ ఎలా ఆడతాడన్నది ఆసక్తికరంగా మారిందని ముకుంద్ ప్రశ్నించాడు. హార్దిక్ జట్టులో ఆల్‌రౌండర్‌గా మాత్రమే కొనసాగుతాడా? జట్టు సమతుల్యత ఎలా ఉంటుంది? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందన్నాడు. హార్దిక్ రాకతో పంజాబ్ జట్టులో ఇప్పటికే ఉన్న మార్కస్ స్టోయినిస్ భవిష్యత్తుపైనా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నాడు.**అర్ష్‌దీప్‌తో బుమ్రాకు జోడీ**అర్ష్‌దీప్ ముంబై ఇండియన్స్‌లో చేరితే జస్ప్రీత్ బుమ్రాతో కలిసి బలమైన పేస్ దళాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. పవర్‌ప్లేలో వికెట్లు తీయడంతో పాటు చివరి ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అర్ష్‌దీప్‌కు ఉంది. మరోవైపు అర్ష్‌దీప్‌ను వదులుకోవడం పంజాబ్ బౌలింగ్ విభాగాన్ని బలహీనపరచవచ్చని మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా అభిప్రాయపడ్డాడు.ఈ మార్పిడి జరిగితే పంజాబ్ జట్టులో యువ ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్జేకు అవకాశాలు తగ్గుతాయా అన్న సందేహాన్ని కూడా అభినవ్ ముకుంద్ వ్యక్తం చేశాడు. మొత్తానికి ఐపీఎల్ వేలానికి ముందు ఈ ఆటగాళ్ల మార్పిడి రెండు జట్ల కూర్పులో ఎలాంటి మార్పులు తీసుకొస్తుందోనని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

భారత పేసర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు విలవిల

యువ బౌలర్ల ప్రదర్శనపై న్యూజిలాండ్ బ్యాటింగ్ కోచ్ లూక్ రోంచి ప్రశంసలు
పరిస్థితులను చక్కగా ఉపయోగించుకుంటున్న భారత బౌలర్లు..
బ్యాటర్లకు సవాల్‌గా మారిన పేస్ దళం



హామిల్టన్, నవంబర్ 9:న్యూజిలాండ్ పర్యటనలో భారత యువ ఫాస్ట్ బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. తమ పదునైన బంతులు, కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో కివీస్ బ్యాటర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. భారత పేసర్ల ప్రదర్శనపై న్యూజిలాండ్ బ్యాటింగ్ కోచ్ లూక్ రోంచి ప్రశంసలు కురిపించాడు. భారత బౌలర్లు తమ బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వడం లేదని, బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పరిస్థితులను అద్భుతంగా వినియోగించుకుంటున్నారని పేర్కొన్నాడు.అర్ష్‌దీప్ సింగ్, ఔకిబ్ నబీ, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్ వంటి యువ బౌలర్లు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని తెలిపాడు. తొలి రెండు వన్డేల్లో న్యూజిలాండ్ కోల్పోయిన 20 వికెట్లలో 17 వికెట్లను భారత పేసర్లు పడగొట్టడం వారి ఆధిపత్యానికి నిదర్శనంగా నిలిచింది. ఆక్లాండ్, వెల్లింగ్టన్ వేదికలుగా జరిగిన మ్యాచ్‌ల్లో కివీస్ బ్యాటింగ్ విభాగం పూర్తిగా తడబడింది. తొలి మ్యాచ్‌లో 185 పరుగులకు, రెండో మ్యాచ్‌లో 134 పరుగులకే ఆలౌట్ కావడం భారత బౌలింగ్ బలాన్ని తెలియజేస్తోంది.**పిచ్‌లను సమర్థంగా వినియోగించుకుంటూ..**న్యూజిలాండ్ పరిస్థితుల్లో బంతి స్వింగ్, సీమ్ అవుతున్నప్పుడు భారత బౌలర్లు దానిని చక్కగా ఉపయోగించుకుంటున్నారని రోంచి వివరించాడు. ముఖ్యంగా తొలి ఓవర్లలోనే వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి పెంచుతున్నారని పేర్కొన్నాడు. బౌలర్లు క్రమశిక్షణతో బంతులు వేస్తూ బ్యాటర్లను తప్పులు చేసేలా చేస్తున్నారని తెలిపాడు. భారత పేసర్లు కేవలం వేగంపైనే ఆధారపడకుండా బంతి కదలికలను కూడా సమర్థంగా ఉపయోగించుకుంటున్నారని ప్రశంసించాడు.భారత జట్టులో యువ బౌలర్లకు లభిస్తున్న అవకాశాలు, వారు చూపుతున్న ప్రతిభ జట్టుకు భవిష్యత్తులో మరింత బలాన్ని అందించనున్నాయి. సీనియర్ బౌలర్లతో పాటు యువ పేసర్లు కూడా కీలక సమయాల్లో వికెట్లు తీస్తుండటం భారత జట్టు బౌలింగ్ విభాగానికి సానుకూల అంశంగా మారింది.**బ్యాటర్లు సంయమనంతో ఆడాలి**మరోవైపు తమ బ్యాటర్లు కూడా పరిస్థితులకు అనుగుణంగా ఆడాల్సిన అవసరం ఉందని రోంచి సూచించాడు. ప్రతి మ్యాచ్‌లో భారీ స్కోర్లు సాధించాలనే ఆలోచనతో బరిలోకి దిగడం సరైన విధానం కాదన్నాడు. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రత్యర్థి బౌలర్లకు అనుగుణంగా వ్యూహాలు మార్చుకోవాలని పేర్కొన్నాడు. బంతి స్వింగ్ అవుతున్నప్పుడు ఆచితూచి ఆడటం, క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత పరుగుల వేగాన్ని పెంచడం ముఖ్యమని వివరించాడు.తొలి ఓవర్లలో వికెట్లు కోల్పోతే మిగతా బ్యాటర్లపై ఒత్తిడి పెరుగుతుందని, అందువల్ల ఆరంభంలో వికెట్లను కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించాడు. భారత బౌలర్లను ఎదుర్కొనేందుకు బ్యాటింగ్ విభాగం కొత్త వ్యూహాలతో సిద్ధం కావాల్సి ఉందని అభిప్రాయపడ్డాడు.

బాల్ ట్యాంపరింగ్ వివాదంలో కొత్త మలుపు!

- ఉస్మాన్ ఖవాజాకు డేవిడ్ వార్నర్ మద్దతు.. ఎనిమిదేళ్ల తర్వాత బయటపడుతున్న సంచలన విషయాలు



సిడ్నీ, నవంబర్ 9:ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో చోటుచేసుకున్న శాండ్‌పేపర్ వివాదంపై మాజీ ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా చేసిన వ్యాఖ్యలకు మరో మాజీ ఆటగాడు డేవిడ్ వార్నర్ మద్దతు ప్రకటించాడు. ఖవాజా వెల్లడించిన విషయాలు నూటికి నూరు శాతం నిజమని స్పష్టం చేశాడు. ఈ ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వహించిన విచారణ హడావుడిగా, లోపభూయిష్టంగా జరిగిందని విమర్శించాడు.**అసలు ఏం జరిగింది?**2018లో దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ వేదికగా జరిగిన మూడో టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాడు కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ శాండ్‌పేపర్‌తో బంతి స్వరూపాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తూ కెమెరాలకు చిక్కాడు. ఈ ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌లో తీవ్ర సంచలనం సృష్టించింది. విచారణ అనంతరం డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌లపై క్రికెట్ ఆస్ట్రేలియా కఠిన చర్యలు తీసుకుంది. వార్నర్, స్మిత్‌లకు ఏడాది పాటు నిషేధం విధించగా, బాన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల నిషేధం విధించారు. వార్నర్‌పై నాయకత్వ బాధ్యతలు చేపట్టకుండా శాశ్వత నిషేధం కూడా విధించారు. అనంతరం 2024లో ఆయనపై ఆ నాయకత్వ నిషేధాన్ని తొలగించారు.**జట్టంతటికీ తెలుసు: ఖవాజా**తాజాగా తన ఆత్మకథ 'సర్వ్'లోని కొన్ని విషయాలను వెల్లడించిన ఉస్మాన్ ఖవాజా ఈ వివాదంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. బంతి ఆకారాన్ని మార్చే ప్రయత్నం గురించి జట్టులోని బ్యాటర్లు, బౌలర్లు, సహాయక సిబ్బంది సహా అందరికీ తెలుసునని పేర్కొన్నాడు. ఇది కేవలం ముగ్గురు ఆటగాళ్లకు సంబంధించిన వ్యవహారం కాదని, జట్టులోని పలువురికి ఈ విషయం తెలిసి ఉందని వెల్లడించాడు. ఈ ఘటనపై అప్పట్లో జరిగిన విచారణలో తనను ప్రశ్నించలేదని కూడా ఆరోపించాడు.తాను కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ పక్కనే ఉన్నప్పటికీ విచారణలో తన వాంగ్మూలాన్ని తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించిందని ఖవాజా పేర్కొన్నాడు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు బయటకు రావాలని, ముగ్గురు ఆటగాళ్లపైనే మొత్తం బాధ్యతను మోపడం సరైనది కాదని అభిప్రాయపడ్డాడు.**వార్నర్ ఏమన్నాడంటే..**ఖవాజా వ్యాఖ్యలపై స్పందించిన డేవిడ్ వార్నర్ సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేశాడు. తన చిన్ననాటి స్నేహితుడైన ఖవాజాకు పూర్తి మద్దతు ప్రకటించాడు. ఆయన వెల్లడించిన విషయాలు పూర్తిగా నిజమని పేర్కొన్నాడు. ఎనిమిదేళ్లుగా ఈ అంశంపై తాను బహిరంగంగా మాట్లాడలేదని, ఇప్పుడు నిజాలు బయటకు రావాల్సిన సమయం వచ్చిందని తెలిపాడు.ఖవాజా విచారణలో భాగంగా వాంగ్మూలం ఇవ్వకపోవడాన్ని వార్నర్ ప్రశ్నించాడు. అసలు ఆయనను విచారించకుండా జరిగిన ప్రక్రియను సమగ్ర విచారణగా ఎలా పరిగణిస్తారని నిలదీశాడు. అప్పట్లో జరిగిన విచారణ తొందరపాటుతో, సరైన పద్ధతిలో సాగలేదని విమర్శించాడు. ఈ వ్యవహారంలో ఎవరినీ నిందించడం తమ ఉద్దేశం కాదని, వాస్తవాలు వెలుగులోకి రావడం, పారదర్శకత, బాధ్యతాయుతమైన విచారణ జరగడమే ముఖ్యమని పేర్కొన్నాడు.**క్రికెట్ ఆస్ట్రేలియా సమాధానం**మరోవైపు క్రికెట్ ఆస్ట్రేలియా మాత్రం గతంలో నిర్వహించిన విచారణపై తన వైఖరిని సమర్థించుకుంది.

కోహ్లీ ఔటవడంతో గిల్‌కు తప్పిన చిక్కు!

- గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు



స్పోర్ట్స్ డెస్క్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లీ 51 బంతుల్లో 74 పరుగులు చేసి ఔటైన విషయం తెలిసిందే. దీనిపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ సెంచరీకి చేరువలో ఉండి ఉంటే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొనేవారని అభిప్రాయపడ్డారు.కోహ్లీ 90లలో ఉండి ఉంటే జట్టు విజయానికి వేగంగా పరుగులు చేయాలా? లేక అతడికి సెంచరీ అవకాశం కల్పించాలా? అనే సందిగ్ధం ఇద్దరికీ ఎదురయ్యేదని గావస్కర్ పేర్కొన్నారు. వేగంగా ఆడి మ్యాచ్ ముగిస్తే అభిమానుల నుంచి విమర్శలు వచ్చే అవకాశం ఉండేదన్నారు. కోహ్లీ ఔటవడంతో గిల్, అయ్యర్‌కు ఆ ఇబ్బంది తప్పిందని తెలిపారు. కోహ్లీ 100 అంతర్జాతీయ సెంచరీలు సాధించాలని ప్రతి భారత అభిమాని కోరుకుంటున్నారని, సహచరుల సహకా రంతో ఆ ఘనత సాధిస్తే అభిమానుల ందరికీ ఆనందమే నని గావస్కర్ పేర్కొన్నారు. అయితే వ్యక్తిగత రికార్డు జట్టు విజయావకాశాలను దెబ్బతీయకూడదని స్పష్టం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

వెట్టువమ్ 'సెలబ్రేట్ రెసిలియెన్స్'..

ఇంటెన్స్ లుక్‌లో శోభిత



రెండు భిన్నమైన వర్గాల మధ్య జరిగే ఆధిపత్య పోరును సహజంగా తెరకెక్కించడంలో దర్శకుడు పా. రంజిత్ రూటే వేరు. ఆయన నుంచి వస్తున్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ వెట్టువమ్. ఆర్య, దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా నుంచి సెలబ్రేట్ రెసిలియెన్స్ పేరుతో మేకర్స్ ఓ మేకింగ్ వీడియోను విడుదల చేశారు. చిన్న గ్లింప్స్‌తోనే సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతోందో క్లియర్ కట్ హింట్ ఇచ్చారు. ఈ వీడియోలో చూపించిన మేకింగ్ షాట్స్ ప్రాజెక్ట్ చూస్తుంటే గ్రాండ్ స్కేల్‌లోనే ప్లాన్ చేస్తున్నట్లు అర్థమవుతుంది. ఒక పెద్ద విలేజ్ సెట్ నడుమ వందలాది మందితో ప్లాన్ చేసిన భారీ కొట్లాటలు, గాల్లోకి లేచే కార్లు, బ్లాస్టింగ్‌లు చూస్తుంటే ఫుల్ యాక్షన్ డ్రామా రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. పా. రంజిత్ స్వయంగా మైక్ పట్టుకుని సీన్లను లీడ్ చేయడం, దిలీప్ సుబ్బరాయన్ కంపోజ్ చేసిన రియలిస్టిక్ స్టంట్స్ విజువల్స్ లో మంచి ఇంటెన్సిటీ తీసుకొచ్చాయి. వీడియోలో హీరోల లుక్స్ ప్రాజెక్ట్‌పై ఆసక్తిని పెంచుతున్నాయి. గోధుమ రంగు షర్ట్, గాగుల్స్‌తో మాస్ లీడర్‌లా నడిచివచ్చే ఆర్య, మరో సీన్‌లో తెల్లటి దుస్తుల్లో చేతిలో గన్ పట్టుకుని నిలబడే ఫ్రేమ్స్ అదిరిపోయాయి. మరోవైపు గడ్డంతో ఫుల్ రగ్గడ్ అవతారంలో కనిపించిన దినేష్ ఎనర్జీ కూడా చాలా రాగా ఉంది. వీరిద్దరి పాత్రల మధ్య నడిచే క్లాష్ తెరపై అసలైన థ్రిల్ ఇచ్చేలా కనిపిస్తోంది. ఈ గ్లింప్స్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకున్న అంశం శోభితా ధూళిపాళ్ల ప్రెజెన్స్. సాధారణంగా గ్లామరస్ పాత్రల్లో కనిపించే శోభిత, ఇందులో పూర్తి డీగ్లామరైజ్డ్ రగ్గడ్ రోల్‌లో కనిపించి అందరినీ సర్ ప్రైజ్ చేసింది. ఆమె వేసిన మార్షల్ ఆర్ట్స్ ఫైటింగ్ పోజ్, కళ్లలో చూపించిన ఇంటెన్సిటీ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. కథానాయికగానే పరిమితం కాకుండా, ఒక బలమైన పోరాట యోధురాలి తరహా పాత్రను ఎంచుకుని శోభిత తన నటనలోని కొత్త కోణాన్ని చూపిస్తోందనే నమ్మకం కలుగుతోంది.



పూర్ ఫ్యామిలీకి హఠాత్తుగా డబ్బు సంచులు దొరికితే ..

ఓటీటీలో 'ఆల్ పాస్' మూవీ!

కొన్ని కథలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తూనే వినోదాన్ని పంచుతుంటాయి. సహజత్వానికి దగ్గరగా మానవ స్వభావాలను ఆవిష్కరిస్తూనే ఆలోచింపజేస్తాయి. చాలా కుటుంబాలను దగ్గరగా పరిశీలన చేస్తే ఒక విషయం అర్థమవుతుంది. పేదరిమలో ఉన్నప్పుడు వాళ్లంతా చాలా ప్రేమతో ఉంటారు. అనుకోకుండా వాళ్ల మధ్యకి డబ్బు వచ్చిపడినప్పుడు ఆ ప్రేమ కలుషితం అవుతూ ఉంటుంది. ఇందుకు అతీతంగా వ్యవహరించేవారు సంఖ్య చాలా అరుదనే చెప్పాలి. అలాంటి ఒక కథతో రూపొందిన సినిమానే 'ఆల్ పాస్'. తమిళంలో మోహన్ రంగనాథన్ నిర్మించిన ఈ సినిమాకి మైదీన్ దర్శకత్వం వహించాడు. అక్టోబర్ 9వ తేదీన థియేటర్లలో విడుదలైన సినిమా ఇది. దుష్యంత్ జయప్రకాశ్ .. సెంథిల్ కుమారి.. సుబ్రహ్మణ్యం శివ .. జనని కునశీలన్ .. వినోదిని వైద్యనాథన్ ముఖ్యమైన పాత్రలను పోషించారు. జేమ్స్ వసంతన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నెల 6వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ కథ చెన్నైలోని ఒక బస్తీలో జరుగుతుంది. ఈ బస్తీలో మూడు కుటుంబాల వారు చాలా కాలంగా నివసిస్తూ ఉంటారు. ఈ పేదరికాన్ని తట్టుకుని నిలబడాలంటే, తామంతా ఉమ్మడి కుటుంబంగా ఉండటమే మార్గమని భావిస్తారు. అంతా కలిసి ఒకే ఇంట్లో ఎంతో ప్రేమగా నివసిస్తూ ఉంటారు. అదే సమయంలో ఊహించని విధంగా వాళ్ల మధ్యలోకి పెద్ద మొత్తంలో డబ్బు వచ్చిపడుతుంది. అప్పటి నుంచి వాళ్లలో ఎలాంటి మార్పు వస్తుంది? వాళ్లతో ఏమేం చేయిస్తుంది? చివరికి వాళ్లు గ్రహించే నిజం ఏమిటి? అనేది కథ.

అనిరుధ్-కావ్యల పెళ్లి సందడి..

గ్రీస్‌కు బయల్దేరిన తలైవా, మాజీ సీఎం స్టాలిన్



ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ వివాహ బంధంతో ఒకటవ్వబోతున్నారు. వీరి వివాహ వేడుక గ్రీస్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్‌గా నవంబర్ 10, 11 తేదీల్లో అత్యంత సన్నిహితుల మధ్య జరగనుంది. ఈ వేడుకకు హాజరయ్యేందుకు సూపర్ స్టార్ రజనీకాంత్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ రోజు ఉదయం విమానాశ్రయం నుంచి గ్రీస్‌కు బయల్దేరి వెళ్లారు. దీంతో ఈ హై-ప్రొఫైల్ వివాహంపై అందరి దృష్టి నెలకొంది.
కావ్య మారన్, ప్రఖ్యాత సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ కుమార్తె. ఆమె ప్రస్తుతం ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవోగా, సన్ టీవీ నెట్‌వర్క్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు అనిరుధ్ రవిచందర్ ప్రస్తుతం దక్షిణాది సినిమా పరిశ్రమలో అగ్ర సంగీత దర్శకుడిగా కొనసాగుతున్నారు. ఎంతోకాలంగా వీరిద్దరి వివాహంపై చర్చలు జరుగుతుండగా, ఇప్పుడు అధికారికంగా పెళ్లి వేడుకలు మొదలయ్యాయి.గ్రీస్‌లో జరిగే ఈ వివాహ వేడుకకు కేవలం ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరు కానున్నారు. ఇది పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమంగా జరగనుంది. అనంతరం నవంబర్ 21న చెన్నైలో సినీ, రాజకీయ, క్రీడా, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖుల కోసం భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ రిసెప్షన్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రికను కావ్య తల్లిదండ్రులు ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేయడంతో వేడుక తేదీ ఖరారైంది.చెన్నై రిసెప్షన్‌కు పలువురు అగ్రశ్రేణి ప్రముఖులు హాజరుకానున్నట్లు సమాచారం. అయితే, ఈ వివాహ ఏర్పాట్లపై అనిరుధ్, కావ్యల కుటుంబాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సోషల్ మీడియాలో మాత్రం వీరి వివాహానికి సంబంధించిన వార్తలు, ప్రముఖుల ప్రయాణ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

ఫెస్టివ్ వైబ్.. ఎలిగెంట్ లుక్ లో మృణాల్ సోయగాలు..



ఫెస్టివల్స్ మొదలయ్యాయి అంటే చాలు సెలబ్రిటీలు అందంగా, సాంప్రదాయంగా ముస్తాబవుతూ అభిమానులకు కన్నుల విందుగా కనిపిస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే దంతేరాస్ సందర్భంగా తెలుగు ప్రేక్షకులను సీతామహాలక్ష్మి పాత్రతో కట్టిపడేసిన మృణాల్ ఠాకూర్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో ప్రత్యేక వైరల్ గా మారుతున్నాయి. చీరకట్టులో కనిపించి తన ఎలిగెంట్ లుక్కుతో అభిమానులను మెస్మరైజ్ చేసింది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సీమ గుజ్రాల్ కలెక్షన్స్ నుండి ఎంపిక చేసిన ఐవరీ కలర్ డిజైనర్ సారీ కట్టుకొని , తన లుక్ తో అభిమానులను ఆకట్టుకుంది. ఈ జార్జెట్ చీర పై క్లిష్టమైన పైస్లీ ఎంబ్రాయిడరీ డిజైన్ తో రూపొందించారు. మొత్తం అద్దాల పనితనం , పూసల అమరిక చాలా ఆకర్షణీయంగా కనిపిస్తోంది. దీనికి మ్యాచింగ్ గా స్ట్రాపీ స్టైల్ లో నెక్ లైన్ కలిగిన హెవీ మిర్రర్ వర్క్ బ్లౌజ్ జత చేసింది. ఈ ఔట్ ఫిట్ లో మృణాల్ తన లుక్ ను మరింత రాయల్ గా మార్చడానికి మెడలో మ్యాచింగ్ హెవీ చౌకర్ నెక్లెస్ ధరించి పెద్ద చెవిపోగులతో తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. మొత్తానికైతే దంతేరాస్ స్పెషల్ సందర్భంగా తన లేటెస్ట్ అవుట్ ఫిట్ తో ఎలిగెంట్గా కనిపించి అభిమానుల హృదయాలను దోచుకుంది .అంతేకాదు మిర్రర్ వర్క్ తో డిజైన్ చేసిన శారీలో దీపావళి మొత్తం మీలోనే కనిపిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు.2012లో ముజ్ సే కుచ్ కెహెతి.. ఏ ఖామోషియాన్ అనే హిందీ సీరియల్ ద్వారా నటన రంగంలోకి అడుగుపెట్టిన ఈమె.. 2014లో విట్టిదండు అనే మరాఠీ చిత్రం ద్వారా నటిగా వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత హిందీ, తెలుగు చిత్రాలలో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. తెలుగు సినిమా విషయానికొస్తే 2022లో హను రాఘవపూడి దర్శకత్వంలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నేరుగా తెలుగులో చేసిన చిత్రం సీతారామం. ఈ చిత్రం ద్వారా వెండితెరకు సీతామహాలక్ష్మి పాత్రతో పరిచయమై అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఈ సినిమాతో ఏకంగా భారీ బ్లాక్ బాస్టర్ విజయం అందుకోవడంతో వరుసగా అవకాశాలు తలుపు తట్టాయి.ఆ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ వంటి చిత్రాలలో నటించినా.. ఈమె సరైన సక్సెస్ అందుకోలేదు. ఆ తర్వాత డెకాయిట్ చిత్రంలో నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. రీసెంట్ గా పూజ మేరీ జాన్ అనే ఓటిటీ చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక ప్రస్తుతం రాకాసినిమాలో నటిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కానీ దీనిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇంకా వెలువడలేదు. ఏది ఏమైనా మృణాల్ ఠాకూర్ ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా వరుస భాషా చిత్రాలలో నటిస్తూ తన స్టార్ స్టేటస్ ను మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తుంది ఈ ముద్దుగుమ్మ.

దీపావళి రోజున కుమ్మేసిన 'రామాయణ'



బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్ తో తెరకెక్కిన పౌరాణిక చిత్రం 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్ల మార్కుకు చేరువై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ముఖ్యంగా దీపావళి పర్వదినం రోజున ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన లభించడంతో భారీ వసూళ్లు నమోదయ్యాయి.
దీపావళి, ఆదివారం రెండూ కలిసి రావడంతో సినిమా విడుదలైన నాలుగో రోజున ఒక్కరోజే దేశీయంగా రూ.56.15 కోట్ల నెట్ వసూళ్లను ఈ చిత్రం రాబట్టింది. దీంతో 2023లో సల్మాన్ ఖాన్ చిత్రం 'టైగర్ 3' దీపావళి నాడు సాధించిన రూ.44.50 కోట్ల రికార్డును 'రామాయణ' అధిగమించింది. ఇప్పటివరకు దీపావళి పండుగ రోజున బాలీవుడ్‌లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది.ఈ సినిమా భారత్‌లో తొలి రోజు రూ.64.85 కోట్లు, రెండో రోజు రూ.48.05 కోట్లు, మూడో రోజు రూ.69.80 కోట్లు, నాలుగో రోజు రూ.56.15 కోట్ల నెట్ రాబట్టింది. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం నెట్ కలెక్షన్లు రూ.238.85 కోట్లకు చేరగా, గ్రాస్ వసూళ్లు రూ.285.20 కోట్లుగా నమోదయ్యాయి. గతంలో ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' తొలి నాలుగు రోజుల్లో సాధించిన రూ.237 కోట్ల నెట్ మార్కును కూడా 'రామాయణ' దాటేసింది. ఇక ఓవర్సీస్‌లో రూ.214 కోట్ల గ్రాస్ రావడంతో, ప్రపంచవ్యాప్తంగా మొత్తం వసూళ్లు రూ.499.20 కోట్లకు చేరుకున్నాయి. దీంతో అతి తక్కువ సమయంలోనే రూ.500 కోట్ల మైలురాయిని అందుకోవడానికి ఈ చిత్రం సిద్ధమైంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613